మంగళవారం
06-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 46
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బ్రిటన్‌లో వలసదారులకు వ్యతిరేకంగా నిరసనలు

లండన్: వలసదారులకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలతో బ్రిటన్ అట్టుడుకుతోంది. బ్రిటన్ దేశానికి చెందిన ముగ్గురు బాలికల మృతికి ఒక వలసదారుడే కారణమని ఆరోపిస్తూ ఇంగ్లండ్, ఉత్తర ఐర్లాండ్‌లో వలస దారుల వ్యతిరేక గ్రూపులు నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. దీంతో పోలీసులు 87 మందికి పైగా ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. గత వారం ఒక డాన్స్ స్కూల్‌లో ముగ్గురు బాలికలను ఒక వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేయడంతో దేశంలోని లివర్‌పూల్, బ్రిస్టల్, హుల్, సోటక్ ఆన్ ట్రెంట్, బ్లాక్‌పూల్ సహా అనేక ప్రాంతాల్లో వలస వ్యతిరేక సంస్థలకు చెందిన అనేక మంది ఆందోళన చేపట్టారు. ఈ కేసులో అనుమానితుడు బ్రిటన్ పౌరుడని, వలసదారుడు కాదని పోలీసులు స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్

తిరస్కరణ

న్యూఢిల్లీ: మద్య విధానం కుంభ కోణంలో ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మద్యం విధానంలో అక్రమాలపై సీబీఐ అరెస్టును సమర్థించింది. తన అరెస్టును సవాలు చేస్తూ కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేయగా... జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టి వేసింది. సరైన కారణం లేకుండా అరెస్ట్ జరిగిందనడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంది. బెయిల్ కోసం చేసుకున్న దరఖాస్తును సైతం

- మిగతా 2 లో

ఆప్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) సభ్యులను నామినేట్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ)కు ఉందని స్పష్టం చేసింది. ఆ నామినేషన్ విషయంలో స్థానిక ప్రభుత్వం సలహా అవసరం లేదని తేల్చి చెప్పింది. ఎంసీడీలో 10 మంది సభ్యుల్ని మంత్రి మండలి సలహా మేరకు నామినేట్ చేయాలంటూ ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్

- మిగతా 2 లో

చిన్నారిపై అత్యాచారం

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: సభ్య సమాజం తలదించు కునే విధంగా నిత్యం ఏదో ప్రాంతంలో దారుణమైన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. పసిబిడ్డలపై కామాంధులు కళ్లు పడుతూనే ఉన్నాయి. రాక్షసుల కంబధ హస్తాల్లో చిన్నారులు ఉసురు కోల్పోతూనే ఉన్నారు. చట్టాలు ఎన్ని ఉన్నా అభంశుభం తెలియని చిన్నారులపై అత్యాచారాలు నిత్యకృత్యమౌతున్నాయి. ఇందుకు ఏలూరు జిల్లా నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి పసికూనపై జరిగిన అఘాయిత్యం సమాజంలో రాక్షస

- మిగతా 2 లో

హసీనా పలాయనం

కొంప ముంచిన రిజర్వేషన్ల రగడ

- బంగ్లాదేశ్‌లో నాటకీయ పరిణామాలు
- రాజీనామా చేసి భారత్ చేరుకున్న బంగ్లా ప్రధాని
- రంగంలోకి సైన్యం... తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుపై ప్రకటన
- సంయమం పాటించాలని ఆందోళనకారులకు బంగ్లా సైన్యాధిపతి పిలుపు
- నిరసనకారుల సంబురాలు... ప్రధాని అధికారిక నివాసం ముట్టడి

ఢాకా: హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. నాటకీయ పరిణామాల నడుమ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వం కుప్పకూలింది. ప్రధాని పదవికి రాజీనామా చేసిన హసీనా భారత్ చేరుకున్నారు. మరోవైపు.. హసీనా ఢాకా విడిచిపెట్టారనే సమాచారం అందిన వెంటనే వేల మంది నిరసనకారులు ప్రధాని నివాసాన్ని చుట్టుముట్టి విధ్వంసకాండకు దిగారు. ఆ దేశ మాజీ ప్రధాని, హసీనా తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. అయితే కాసేపటికే సైన్యం రంగప్రవేశం చేయడంతో వాళ్లంతా వెనక్కి తగ్గారు. ఆ తర్వాత సైన్యం పాలనను తమ చేతుల్లోకి తీసుకున్నట్లు ప్రకటించింది. మరోవైపు.. హసీనా దేశం విడిచి వెళ్లిపోయారని సైన్యం ప్రకటించగానే.. రోడ్ల మీదకు చేరిన లక్షల మంది నినాదాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. దేశంలో పరిస్థితులు పూర్తిగా అదుపుల్లోకి వచ్చే దాకా కర్ఫ్యూ కొనసాగుతుందని సైన్యం ప్రకటించింది. "మేం తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. నిరసనల వల్ల ఈ దేశం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. ఎన్నో

- మిగతా 2 లో

సరిహద్దులో బీఎస్ఎఫ్ బలగాల మోహరింపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటా అంశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. దేశాన్ని అగ్ని గుండంలా మార్చింది. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పొరుగు దేశంలో ఉద్రికత్తల నేపథ్యంలో భారత సైన్యం అప్రమత్తమైంది. భారత్- బంగ్లా సరిహద్దులో సరిహద్దు భద్రతాదళం(బీఎస్ఎఫ్) హైఅలర్ట్ ప్రకటించింది. 4,096 కిలోమీటర్ల మేర ఉన్న భారత్- బంగ్లా సరిహద్దులో అదనపు బలగాలను వెంటనే మోహరించా లని ఆదేశించింది. కమాండర్లందరూ సరిహద్దులోనే ఉండాలని సూచించినట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక, రాజకీయ పరిణామాల దృష్ట్యా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉద్రిక్తతలు పెరగడంతో సరిహద్దులో ఉన్న బీఎస్ఎఫ్ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. ఎటువంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేందుకు బలగాలు సిద్ధంగా ఉన్నాయి. తాజా పరిస్థితులను సమీక్షించేందుకు ఇప్పటికే బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌదరి కోల్‌కతా చేరుకున్నట్లు తెలుస్తోంది.

ఆర్-5 జోన్ ఇళ్ల స్థలాలు

వెనక్కి...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధానిలో ఆర్-5 జోన్ నుంచి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు చుక్కెదురైంది. వారికి సొంత ప్రాంతాల్లోనే ఇళ్లు ఇవ్వడం లేదా టిడ్కో ఇళ్లల్లో అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వెలగపూడి సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని ప్రకటించారు. ఆర్-5 జోన్‌లోని లబ్ధిదారులకు వారి ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. లబ్ధిదారుల కోసం భూమి సమీకరించాలని... లేదంటే భూ సేకరణ చేస్తామని, వాటికి అవకాశం కల్పించకుంటే టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని సీఎం ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని ఆర్-5 జోన్‌లో దాదాపు 50 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. జగనన్న కాలనీల్లో భాగంగా గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం, మంగళగిరి తదితర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించగా... దానిపై రాజధాని

- మిగతా 2 లో

కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలు

ఢిల్లీ ఘటనపై 'సుప్రీం' తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఓ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడమే కాకుండా అధికారుల తీరుపై ఆగ్రహం వెలిబుచ్చింది. కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కోచింగ్ సెంటర్లను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడింది. 'ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ఢిల్లీకి వచ్చిన విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. నగరంలోని కోచింగ్ సెంటర్లు డెత్ ఛాంబర్‌లు (మృత్యు కుహరాలు)గా మారాయి. వాటిని సక్రమంగా నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఈ ఘటన అందరి కళ్లు తెరిపించింది' అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇనిస్టిట్యూట్‌లో భద్రతా ప్రమాణాలు అందించే వరకూ ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించుకోవచ్చని సూచించింది. కోచింగ్ సెంటర్లను ఎలాంటి నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారో న్యాయస్థానానికి

- మిగతా 2 లో

బ్రాండ్ ఏపీ నిలబెడదాం

- ప్రతినెలా 1న పేదల సేవలో...
- మంత్రుల, ఎమ్మెల్యేల మాట వినాలి
- అక్టోబరు 2న విజన్ డాక్యుమెంట్ విడుదల
- వినూత్న ఆలోచనతో ముందుకెళ్లాలి
- ప్రభుత్వంపై అసత్య ప్రచారం తిప్పికొట్టాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ప్రభుత్వ అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్ర బ్రాండ్ దెబ్బతిందని, మళ్లీ ఏపీ బ్రాండ్ నిలబెట్టుకోవాల్సి ఉందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఐఏఎస్ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లాలని, మానవీయ కోణంలో స్పందించాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పేది అధికారులు వినాలని, వారి ఆలోచనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన సోమవారం కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. దీనికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, వివిధ శాఖల మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. తొలుత సీఎం చంద్రబాబుకు సీఎస్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తూ, గత ప్రభుత్వ కలెక్టర్ల సదస్సు ద్వారా ప్రజా వేదిక కూల్చి విధ్వంస పాలనకు నాంది పలికారని, నేటి కలెక్టర్ల సదస్సు రాష్ట్ర అభివృద్ధికి నాంది కావాలన్నారు. ప్రతి నెల 1వ తేదీన 'పేదల సేవలో' కార్యక్రమంతో అధికారులు ప్రజలతో మమేకమవ్వాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రం కోసం అక్టోబరు 2న విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వంపై చేసే అసత్య ప్రచారాన్ని అధికారులు కూడా తిప్పి కొట్టాలని, అధికారులు, శాఖలు సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా మంచిని చెప్పాలని సూచించారు. జిల్లా స్థాయిలో కూడా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసుకోవాలని, 100 రోజుల్లో మార్పు కనిపించాలని కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి వెళ్లిన ఐఏఎస్ అధికారులు... ఆర్‌బీఐ గవర్నర్లు అయ్యారని, కేంద్రంలో ఉన్నత స్థాయిల్లో ఉన్నారని, ప్రపంచ బ్యాంకుకూ వెళ్లారని చెప్పారు. వ్యవస్థలో ఏదైనా చిన్న తప్పు జరిగితే సరిచేయవచ్చని, మొత్తంగా జరిగిన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే భారీ కసరత్తు చేయాలని, అహర్నిశలు కష్టపడాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. మనం తీసుకునే నిర్ణయాలు భావితరాలకు ఉపయోగపడాలన్నారు. అధికారులు జవాబువాదారీతనంతో పనిచేయాల్సిన అవసరం ఉందని, కొన్ని కీలక శాఖలు రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తాయని చెప్పారు. అభివృద్ధితోనే ఆదాయం, ఆదాయం వస్తేనే ప్రజలకు ఖర్చు చేయగలుగుతామని, అభివృద్ధితోనే ప్రజలకు సంతృప్తి ఉంటుందన్నారు. మెరుగైన పాలన అందించడం మా బాధ్యత అని, దానికి మేం కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. పని చేసే అధికారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఉత్తమ కలెక్టర్‌గా ఎదిగే లక్ష్యం దిశగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేం గత ఐదేళ్లలో అన్ని విధాల ఇబ్బందులకు గురయ్యామని అన్నారు. నాడు ఎన్నికల హామీలో ప్రజలు

- మిగతా 2 లో

చంద్రబాబు విజన్ కోసం కష్టపడతాం

- ఏపీలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు పూర్తి స్వేచ్ఛ
- కలెక్టర్ల సదస్సులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

2 లో

ఇదీ లోకం!

ఇదేదో ఎన్నికల ముందు పెట్టుంటే మీకీ పాట్లు తప్పేవి కదా సారు!

తక్షణమే రైతులకు రూ.20 వేల సాయం

- 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: పదేళ్లుగా వర్షాలు లేక నష్టపోయిన రైతులకు వెంటనే రూ.20 వేల నష్టపరిహారంతో పాటు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలో పంట పరిశీలన కార్యక్రమంలో భాగంగా అన్నగిరి ఆంజనేయులు పొలంలో కంది పంటను రామకృష్ణ పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కేరళతో పాటు ఉత్తరాది రాష్ట్రాలు భారీ వర్షాలు, వరదలతో అల్లాడుతుంటే... రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలు జిల్లాలు వర్షాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. లక్షలాది ఎకరాల్లో పంట సాగు చేయలేదని తెలిపారు. ఎక్కడైనా విత్తనాలు నాటితో...వర్షాలు

- మిగతా 2 లో

భూకబ్జా బాధితుల పక్షాన పోరాటం

2 లో

కమలా హారిస్ దూకుడు

అమెరికా అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి. ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో అని ఎదురు చూస్తున్నాయి. మరోవైపు అమెరికాలోని అనేక సంస్థలు దీనిపై సర్వేలు నిర్వహిస్తు న్నాయి. తాజాగా ప్రఖ్యాత సీబీఎస్ న్యూస్/యూగవ్ సంస్థ విడుదల చేసిన పోల్ సర్వేలో ఉపాధ్యక్షురాలు, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్... రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ కంటే ముందంజలో ఉన్నట్లు పేర్కొంది.

2 లో

మదురోపై ఈయూ ఒత్తిడి

అమెరికా, లాటిన్ అమెరికాతో పాటు వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సిద్ధమైంది. అధ్యక్ష ఎన్నికల్లో మదురో సాధించిన విజయాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది.

2 లో

పెళ్లికి చైనా యువత దూరం

బీజింగ్: గతంలో చైనా అధిక జనాభా ఉన్న దేశాల్లో మొదటి స్థానంలో ఉండేది. జనాభా నియంత్రణకు అప్పట్లో అధికార వర్గాలు చర్యలు తీసుకోవడంతో క్రమంగా జననాల సంఖ్య తగ్గడంతో అధిక జనాభా ఉన్న దేశంగా భారత్ ప్రథమస్థానంలోకి వచ్చింది. తాజా లెక్కల ప్రకారం చైనాలోని జనాభా సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఒకవైపు జననాల రేటు పడిపోతుండగా మరోవైపు వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. అక్కడ పెళ్లిళ్లు కూడా తగ్గుముఖం పడుతుండటంతో ప్రభుత్వ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఈ ఏడాది తొలి ఆరునెలల్లో 34 లక్షల జంటలు మాత్రమే ఒక్కటయ్యాయని అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం వివాహాల సంఖ్య 4.98 లక్షలు తగ్గిందని తెలిపారు. చైనాలో రోజురోజుకు ఉద్యోగావకాశాలు తగ్గుతుండటం దీనికి కారణమని, ఉద్యోగాల్లో స్థిరపడిన అనంతరమే వివాహాలు చేసుకోవాలనే ఆలోచన, యువకుల సంఖ్య తగ్గుముఖం పట్టడం, ఖర్చులు ఎక్కువ కావడం, మారుతున్న నిర్ణయాలు వివాహాల నమోదు తగ్గడానికి కారణాలని పేర్కొన్నారు. 2014 నుంచి దేశంలో వివాహాల సంఖ్య తగ్గుతూ వస్తోందని, కోవిడ్ మహమ్మారి అనంతరం మరింత తగ్గుదల కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం ఆరు నెలల్లో కనిష్టంగా 34 లక్షల జంటలు మాత్రమే వివాహ బంధంలోకి అడుగుపెట్టాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉండొచ్చని, దీనిని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవడానికి యోచిస్తున్నామన్నారు. కొన్నేళ్లుగా చైనాలో జననాల రేటు తగ్గిపోతుండటంతో ఆందోళన వ్యక్తం చేసిన ప్రభుత్వం... దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. పెళ్లిళ్లు చేసుకునేవారికి, పిల్లలు కనేవారికి రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించింది. అయినప్పటికీ యువత పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

మదురోపై ఈయూ ఒత్తిడి

కారకస్: అమెరికా, లాటిన్ అమెరికాతో పాటు వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోపై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచేందుకు యూరోపియన్ యూనియన్ (ఈయూ) సిద్ధమైంది. అధ్యక్ష ఎన్నికల్లో మదురో సాధించిన విజయాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. వెనిజులాకి చెందిన నేషనల్ ఎలక్షన్ కౌన్సిల్ ప్రకటించిన ఎన్నికల ఫలితాలు గుర్తించబడవని ఈయూ కౌన్సిల్ ఓ ప్రకటనలో తెలిపింది. అధికారిక ఓటింగ్ రికార్డుల పూర్తి ప్రచురణను ఆలస్యం చేసే ఏదైనా ప్రయత్నం వారి విశ్వసనీయతపై సందేహాన్ని కలిగిస్తుందని పేర్కొంది. ప్రతిపక్షం ప్రచురించిన ఎన్నికల ఓటింగ్ రికార్డుల కాపీలను అనేక స్వతంత్ర సంస్థలు సమీక్షించాయని, ప్రతిపక్ష నేత ఎడ్మండ్ గొంజాలెజ్ గణనీయమైన మెజారిటీతో అధ్యక్ష ఎన్నికలలో విజేతగా నిలిచినట్లు సూచిస్తున్నాయని ఈయూ ప్రకటన పేర్కొంది. వీలైతే అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన స్వతంత్ర సంస్థతో ఎన్నికల రికార్డుల ధృవీకరణ చేపట్టాలని పేర్కొంది. వివరణాత్మక ఓట్ల లెక్కలు విడుదల చేయాలని ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్‌తో కూడిన ఈయూ దేశాలు కోరుతున్నాయి. వెనిజులా అధ్యక్ష ఎన్నికలపై ఆడిట్ నిర్వహించాలని ఇప్పటికే అధ్యక్షుడు నికొలస్ మదురో వెనిజులా హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎన్నికల్లో తాను సాధించిన విజయంపై అమెరికా అనుకూల ప్రతిపక్ష నేతలు నానా యాగీ చేస్తున్న సంగతి తెలిసిందే. న్యాయం కోసం తానే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని మదురో వ్యాఖ్యానించారు. తనను కోర్టుకు పిలవాలని, ప్రశ్నించాలని, సత్యాన్ని వివరించాలని కోరారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

కమలా హారిస్ దూకుడు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి. ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో అని ఎదురు చూస్తున్నాయి. మరోవైపు అమెరికాలోని అనేక సంస్థలు దీనిపై సర్వేలు నిర్వహిస్తున్నాయి. తాజాగా ప్రఖ్యాత సీబీఎస్ న్యూస్/యూగవ్ సంస్థ విడుదల చేసిన పోల్ సర్వేలో ఉపాధ్యక్షురాలు, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్... రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ కంటే ముందంజలో ఉన్నట్లు పేర్కొంది. కొన్ని రాష్ట్రాల్లో పోటాపోటీ ఉండనుందని తెలిపింది. నవంబర్ 5న ఎన్నికలు జరగనుండగా ఇద్దరు అభ్యర్థులు వేగంగా పావులు కదుపుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు విజయావకాశాలు మెరుగయ్యాయి. భారీ మొత్తంలో విరాళాలు వచ్చాయి. ఆమె సభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. కాగా త్వరలో ఆమె తన రన్నింగ్ మేట్(ఉపాధ్య అభ్యర్థి)ను ప్రకటించనున్నట్లు సమాచారం. కమలా హారిస్‌కు మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మద్దతు పలికారు. ఈ విషయాన్ని ఆయన మనవడు జాసన్ తాజాగా విలేకరులకు వెల్లడించారు. కార్టర్ 1977-81 మధ్య అమెరికా అధ్యక్షుడిగా పనిచేశారు. మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్, పెన్సిల్వేనియా గవర్నర్ జోష్ షాపిరో, అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ ఆదివారం వాషింగ్టన్‌లో హారిస్‌ను కలిసినట్లు వాషింగ్టన్ పోస్ట్ నివేదించింది. కాగా గత నెలలో హత్యాయత్నం జరిగిన అనంతరం ట్రంప్‌నకు విజయావకాశాలు పెరిగినట్లుగా అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ఆయన నిర్వహించిన అనేక ర్యాలీల్లో మాట్లాడుతూ హారిస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో విమర్శలు ఎదుర్కొన్నారు.

'బ్రాండ్ ఏపీ' నిలబెడదాం

(మొదటిపేజీ తరువాయి)

గెలవాలని, ఎన్డీఏకు ఓట్లు వేయాలని కోరామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని చెప్పగా... ప్రజలు మా కూటమికి చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలంటే చాలా సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులున్నాయని వివరించారు. ఐదేళ్లలో ఒక్క కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టలేదంటే పరిపాలన ఎలా జరిగిందో మీరు అర్థం చేసుకోవచ్చని సీఎం వ్యాఖ్యానించారు. కలెక్టర్లు, అధికారులు సరికొత్త, వినూత్న ఆలోచనతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, సంపద సృష్టించాలన్నారు. మన ప్రభుత్వం సంక్షేమంపై దృష్టిసారిస్తుందని చెప్పారు. ప్రస్తుత పెన్షన్లపై నెలకు రూ.2,730 కోట్లు, ఏడాదికి 33 వేల కోట్లు, ఐదేళ్లకు రూ.1,63,000 కోట్లు ఖర్చు చేయనున్నామని వివరించారు. గత ప్రభుత్వంలో బటన్ నొక్కడం తప్ప, ప్రజలను పరామర్శించలేదన్నారు. త్వరలోనే పేదల సేవలో అనే కార్యక్రమం కింద మనం అనుసంధానం అవుదామని చెప్పారు. పేదవారిని చూసినప్పుడు మనసు చలించాలని, ఏం చేస్తే పేదరికం పోతుందో ఆలోచించాలన్నారు. ప్రభుత్వంలో ఎవరూ పెత్తందారీ వ్యవస్థలా ప్రవర్తించకూడదని, అసహ్యంగా మాట్లాడకూడదని సూచించారు. ప్రజాప్రతినిధులు వాస్తవాన్ని మీ దృష్టికి తీసుకువచ్చినప్పుడు సంబంధిత సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. నాయకత్వం అంటే ఓనర్ షిప్‌గా భావించాలని, ప్రతి ఒక్క అధికారి ప్రభుత్వం చేసే కార్యక్రమాలను సొంతం చేసుకోవాలని, సమర్థవంతంగా కలెక్టర్లు పని చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం గనులు, ఆర్థిక, ఇసుక, వ్యవసాయ, మత్స్య తదితర శాఖల వారీగా చంద్రబాబు సమీక్షించారు.

ఆప్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

వేసింది. దీనిని విచారించిన న్యాయస్థానం...ఆ అవసరం లేదని వెల్లడించింది. దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం నుంచి ఈ అధికారం వచ్చిందని, అందువల్ల ఎల్‌జీ స్థానిక ప్రభుత్వ సలహా పాటించాల్సిన అవసరం లేదని కోర్టు పేర్కొంది. ఆయనకు చట్ట ప్రకారం ఆ అధికారం లభించిందని వ్యాఖ్యానించింది. 2022 డిసెంబర్‌లో జరిగిన దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆప్ విజయం సాధించింది. మొత్తం 250 వార్డుల్లో మెజార్టీ మార్క్(126) దాటి... 134 స్థానాలు కైవసం చేసుకుంది. అయితే... లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నియమించిన 10 మంది నామినేటెడ్ కౌన్సిలర్లతో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణ స్వీకారం చేయించడం వివాదానికి కారణమైంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆప్ ఆశ్రయించగా... తాజాగా తీర్పు వెలువడింది.

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

(మొదటిపేజీ తరువాయి)

తిరస్కరించింది. అయితే, బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తొలుత కేజ్రీవాల్‌ను ఈడీ ఈ ఏడాది మార్చి 21న అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఊరట లభించినప్పటికీ... మద్యం విధానంలో అక్రమాలపై కేసు నమోదు చేసిన సీబీఐ... తీహార్ జైల్లో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. ఈ కేసులో జులై 12న సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చినప్పటికీ... సీబీఐ కేసు కారణంగా కేజ్రీవాల్ జైలుకే పరిమితమయ్యారు.

చిన్నారిపై అత్యాచారం

(మొదటిపేజీ తరువాయి)

పోకడలకు అద్దంపడుతోంది. వివరాల్లోకి వెళితే... పల్లెర్లమూడిలో తల్లిదండ్రుల మధ్యలో నిద్రిస్తున్న చిన్నారి(5)ని అర్ధరాత్రి కొందరు కామపిశాచీలు సమీప పామాయిల్ తోటలోకి తీసుకెళ్లి అత్యాచారం జరిపారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న బాలికను తెల్లవారుజామున గ్రామస్థులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గ్రామస్థులతో కలిసి బాధిత కుటుంబం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి బాలికను తరలించారు. సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీవో భవాని శంకరి పల్లెర్లమూడి గ్రామాన్ని సోమవారం సందర్శించారు. జరిగిన ఘటనపై గ్రామస్థులు, పోలీసులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, దర్యాప్తునకు అవసరమైన మరికొన్ని పరీక్షలు నిర్వహించాల్సి ఉందని వైద్యులు తెలిపినట్లు తెలిసింది.

నిందితులను అరెస్ట్ చేయండి: కొలుసు

చిన్నారిపై జరిగిన అత్యాచారం అత్యంత బాధాకరమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. అవసరమైతే జాగిలాలను రప్పించి నిందితులను పట్టుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. బాలికకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్నారు.

చంద్రబాబు విజన్ కోసం కష్టపడతాం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ్యాంగాన్ని గత పాలకులు నిర్వీర్యం చేశారని, ఇలాంటి పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు అపార అనుభవాన్ని, పరిపాలనా విధానాన్ని, దక్షతను నేర్చుకునేందుకు తనతో పాటు మంత్రి వర్గమంతా సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆశలు, అభిరుచులకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్లు అందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసిందని, ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థను పూర్తి స్థాయిలో చిద్రం చేశారని తెలిపారు. 2047 కల్లా భారతదేశం సూపర్ పవర్ కావాలనే లక్ష్యంలో భాగం వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ ముందుకు వెళ్లాలంటే జిల్లా కలెక్టర్లతో పాటు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి ఈ ఏడాది ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం అమలుపై అనేక తీర్మానాలు చేస్తూ పంచాయతీలను బలోపేతం చేసే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. 2014-19 మధ్య కాలంలో దాదాపు 10 వేల పంచాయతీల్లో ప్రారంభించిన ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పిఠాపురం నియోజక వర్గంలో గ్రే వాటర్ మేనేజ్‌మెంట్ విధానం ద్వారా లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అధునాతన పద్ధతిలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించేందుకు ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్, ఇతర పథకాల కింద నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లను ఓడీఎఫ్ ప్లస్ క్రింద నిర్వహించనున్నట్లు వివరించారు. జల్‌జీవన్ మిషన్ క్రింద ప్రతి గృహానికి సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు ఈ నెల 15 నుంచి పల్స్ సర్వే నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ఏడాది గ్రామ పంచాయతీల్లో 5 కోట్ల 40 లక్షల ట్యాప్ కనెక్షన్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. గ్రామీణ రోడ్లను మెరుగుపర్చడంతో పాటు దాదాపు 4,729 కి.మి. మేర నూతన రోడ్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో 29.23 శాతం మేర 37,431 చదరపు కిలోమీటర్ల నోటిఫైడ్ అటవీ ప్రాంతం ఉందని, ఆ ప్రాంతానికి బయట 10,221 చదరపు కిలోమీటర్ల పచ్చదనం విస్తరించి ఉన్న ప్రాంతంతో పాటు చెరువు తీరాలు, కొండ ప్రాంతాలు, పంచాయతీ భూములు, వివిధ సంస్థల భూముల్లో కూడా పచ్చదనాన్ని అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. గుంటూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అటవీ ప్రాంతం చాలా తక్కువ ఉందని, ఆయా ప్రాంతాల్లో అటవీ ప్రాంతాన్ని విస్తరింపచేసేందుకు వ్యూహాత్మంగా చర్యలు చేపట్టనున్నామన్నారు. అందుకు గాను అటవీ ప్రాంతాలను పరిరక్షించడం, ఆక్రమణలను తొలగించడం, చట్టవ్యతిరేక కార్యక్రమాలను నియంత్రించడం తదితర చర్యలు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని పవన్ కల్యాణ్ కోరారు.

గ్రామ సచివాలయాల్లో ఇసుక బుకింగ్

▶ అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు ▶ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇసుక కావాల్సిన వినియోగదారులు తమ ప్రాంతంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇసుక బుక్ చేసుకునే విధానం తీసుకొస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో భాగంగా వివిధ శాఖలపై సీఎం సమీక్షించారు. గనుల శాఖ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై చంద్రబాబు మాట్లాడుతూ ఇసుకను ఎవరికి వారు ఇష్టానుసారం దోచుకోవడాన్ని తమ ప్రభుత్వం సహించబోన్నారు. సామాన్యులందరికీ ఇసుక ఉచితంగా లభించేలా పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమాలు యథేచ్ఛగా జరిగాయని, చివరకు సుప్రీం కోర్టుకు చెప్పినప్పటికీ, భయపడని స్థితికి వచ్చారన్నారు. తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరని, ఇసుక అక్రమాలపై సీఐడీతో దర్యాప్తు చేయిస్తామని సీఎం వెల్లడించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మొదటి స్థానంలో ఉండేలా అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. 2014-19 మధ్య ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో మొదటి ఏడాది తప్ప మిగతా నాలుగేళ్లు మొదటి స్థానంలో ఉన్నామని సీఎం గుర్తుచేశారు. విద్యా శాఖపై సమీక్షలో చంద్రబాబు మాట్లాడుతూ డ్రాప్ అవుట్ సంఖ్య జీరోకు చేరాలని, బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు కిట్ల పంపిణీలో రెండు నుంచి మూడు నెలలపాటు నెలల ఆలస్యమైందని, సకాలంలో పంపిణీ చేయడంలో విఫలమైన సంబంధిత ఏజెన్సీని పక్కన బెట్టాలన్నారు. స్థానిక జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలన్నారు. జలవనరుల శాఖపై సీఎం సమీక్షిస్తూ, రిజర్వాయర్లు, చెరువులు నింపేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాల, వరద సమయంలో ముందుగా వరద నీటిని వృథా కాకుండా మనం రిజర్వాయర్లను, చెరువులను నింపేందుకు సీఈలు, ఎస్ఈలతో సమీక్షించాలని సూచించారు.

హసీనా పలాయనం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాలు పోయాయి. ఈ హింసను ఆపాల్సిన సమయం ఇది. నా ప్రసంగం తర్వాత పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నాను. పరిస్థితుల్లో మార్పు వస్తే.. ఎమర్జెన్సీ అవసరం ఉండదు" అని బంగ్లా సైన్యాధిపతి వాకర్-ఉజ్-జమాన్ పేర్కొన్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ... 'నేను (దేశం) అన్ని బాధ్యతలు తీసుకుంటున్నాను. దయచేసి సహకరించండి' అని కోరారు. తాను వివిధ రాజకీయ పక్షాల నేతలను కలిశానని, శాంతిభద్రతల బాధ్యతను సైన్యం తీసుకుంటుందని చెప్పానని పేర్కొన్నారు. అయితే హసీనా అవామీ లీగ్ పార్టీకి చెందిన నాయకులు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. నిరసనకారులు హింసామార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ప్రజలందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఆందోళనకారులపై తుపాకులు ఎక్కుపెట్టవద్దని సైన్యాన్ని ఆదేశించారు. అంతకు ముందు అవామీలీగ్ పార్టీ అధ్యక్షురాలు, ప్రధాని షేక్ హసీనా(76)కు సైన్యం అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. ఆమె పదవి నుంచి దిగిపోయేందుకు 45 నిమిషాల సమయం ఇచ్చినట్లు స్థానిక వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఆమె రాజీనామా చేసి... ఆమె సోదరితో కలిసి దేశం విడిచి వెళ్లిపోయినట్లు తెలిసింది. కాగా సీ-130 ట్రాన్స్‌పోర్ట్ మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఢాకా నుంచి త్రిపురలోని అగర్తలకు వచ్చిన ఆమె అక్కడి నుంచి దిల్లీ సమీపంలోని ఘజియాబాద్ వద్ద ఉన్న హిండన్ ఎయిర్‌బేస్‌కు వచ్చినట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. ఆమె దిల్లీలో ఉంటారా, లేదంటే లండన్ వెళ్తారా అనేది స్పష్టం కాలేదు. ఈ క్రమంలో దిల్లీలోని చాణక్యపురిలో ఉన్న బంగ్లాదేశ్ హై కమిషన్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు.

రిజర్వేషన్ల వ్యవహారంలో బంగ్లాదేశ్‌లో గత కొంతకాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి. హింసాత్మక ఘర్షణలతో ఆ దేశం అట్టుడుకుతోంది. ఇప్పటిదాకా వందల మంది మరణించారు. ప్రధాని హసీనా రాజీనామా డిమాండ్‌తో నిరసనకారులు రోడ్డెక్కారు. గత రెండు రోజులుగా ఆ అల్లర్లు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఆదివారం ఒక్కరోజే వంద మంది వరకు మృతి చెందారు. ఈ నేపథ్యంలో.. ఆందోళనలు తీవ్ర ఉధృతం కావడంతో రాజీనామా ప్రకటనను జాతిని ఉద్దేశించి చేసే ప్రసంగం ద్వారా చేయాలని హసీనా భావించారు. అయితే.. సైన్యం ఆమెకు అంత సమయం ఇవ్వలేదు. సోమవారం ఉదయం ఢాకాలోని ప్రధాని భవనం 'గణభబన్'కు చేరుకున్న ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్... రాజీనామా విషయంలో హసీనాకు 45 నిమిషాల డెడ్‌లైన్ విధించారని, సైన్యం సూచనల మేరకే ఆమె హెలికాప్టర్‌లో దేశం విడిచి సురక్షిత ప్రాంతానికి తరలి వెళ్లారని తెలుస్తోంది. కాగా ఇప్పటిదాకా నిరసనల్లో వందల మంది(300 మందికి పైగా అని అధికారిక సమాచారం) మరణించినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలపై హసీనా తనయుడు సజీబ్ వాజెద్ జాయ్ మాట్లాడుతూ... హసీనా రాజకీయ పునరాగమనం చేయరని చెప్పారు. కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకే ఆమె తన భద్రత కోసమే దేశం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. బలవంతంగా అధికారాన్ని లాక్కోవడం మంచిది కాదంటూ ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ చేశారాయన. అధికారాన్ని చేజిక్కించుకోవాలని యత్నించే ప్రతిఒక్కరినీ అడ్డుకోవాలని సైన్యాన్ని కోరారు.

భారత్ అప్రమత్తం: బంగ్లాదేశ్ పరిస్థితులపై భారత్ అప్రమత్తమైంది. చొరబాట్లు పెరిగే అవకాశం ఉన్నందున సరిహద్దులో నిఘా పెంచాలని సైన్యం నిర్ణయించింది. అంతకు ముందు.. భారత విదేశాంగశాఖ బంగ్లాలో ఉన్న భారతీయులను అప్రమత్తంగా ఉండాలంటూ అడ్వైజరీ జారీ చేసింది. అయితే.. ఇప్పటికే చాలామంది భారతీయులు తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే.

పదిహేనేళ్లుగా పదవిలో...

గత పదిహేనేళ్లుగా బంగ్లా ప్రధాని పదవిలో షేక్ హసీనా కొనసాగుతున్నారు. 1996 జూన్‌లో తొలిసారి ఆమె ప్రధాని పదవి చేపట్టారు. ఆ తర్వాత 2009 నుంచి రాజీనామా దాకా ఆమె ప్రధానిగా కొనసాగారు. మొత్తంగా 20 ఏళ్ల పాటు ఆ పదవిలో కొనసాగిన ఆమె.. సుదీర్ఘకాలంగా ప్రధాని పదవిలో కొనసాగిన బంగ్లాదేశ్ నేతగానే కాకుండా ప్రపంచంలోనూ తొలి మహిళా నేతగా ఘనత సాధించారు.

ఎందుకీ ఆందోళనలు?

1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణత్యాగాలు సైతం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రిజర్వేషన్ల విధానం తీసుకొచ్చింది. విముక్తి ఉద్యమంలో భాగస్వాములైన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించింది. అయితే.. 2018లో ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా అలజడి సృష్టించారు. దాంతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చింది. రిజర్వేషన్లను నిలిపివేసింది. స్వాతంత్ర్య సమరయోధుల బంధువుల విజ్ఞప్తి మేరకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ ఈ ఏడాది జూన్‌లో బంగ్లాదేశ్ హైకోర్టు తీర్పు ప్రకటించడంతో విద్యార్థులు మళ్లీ భగ్గుమన్నారు. రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలంటూ పోరుబాట పట్టారు. వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో షేక్ హసీనా ప్రభుత్వంలో కలవరం మొదలైంది. ఘర్షణల్లో విద్యార్థులు మరణిస్తుండడం, శాంతి భద్రతలు అదుపు తప్పుతుండడంతో హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రిజర్వేషన్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేయకుండా, అన్ని రకాల రిజర్వేషన్లను 7 శాతానికి పరిమితం చేస్తూ తీర్పు వెల్లడించింది. ఇందులో 5 శాతం బంగ్లా స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, 2 శాతం ఇతరులకు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే.. సుప్రీం తీర్పు తర్వాత పరిస్థితి కొంత అదుపులోకి వచ్చినట్లే కనిపించినప్పటికీ... గత రెండ్రోజులుగా కొనసాగిన అల్లర్లు.. హింసాత్మక ధోరణిలో కొనసాగాయి.

భూకబ్జా బాధితుల పక్షాన పోరాటం

▶ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

▶ 20న విజయవాడలో సదస్సు

విశాలాంధ్ర-అనంతపురం: భూకబ్జా బాధితులందరికీ న్యాయం చేసే విధంగా పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మదనపల్లెలో శ్మశానాలను కూడా కబ్జా చేసిన వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రామచంద్ర రెడ్డి సతీమణి స్వర్ణలత పేరు మీద కూడా భూ కబ్జాలు చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కావడాన్ని ప్రస్తావిస్తూ... రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కుమ్మక్కై అగ్ని ప్రమాదం జరిగినట్లుగా కథ అల్లినట్లు కనపడుతోందన్నారు. బత్తలపల్లి లో కూడా కోట్ల రూపాయలు విలువ చేసే మఠం భూములు 19 ఎకరాల 84 సెంట్లు కబ్జాకు గురయ్యాయన్నారు. విశాఖపట్నంలో కూడా భూ కబ్జాలు భారీగా చోటు చేసుకున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో కూడా భూ కబ్జాలు, ఫేక్ డాక్యుమెంట్ల ఘటనలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఈనెల 20 విజయవాడ నగరంలో భూ కబ్జాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన భూకబ్జాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రాయలసీమలో కడప, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో తీవ్ర కరవు పరిస్థితి ఏర్పడిందన్నారు. విత్తనం విత్తిన రైతులకు పెట్టుబడి కూడా రాదన్నారు. వర్షాలు వచ్చినట్లయితే విత్తనాలు, ఎరువుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించాలన్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని, సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ కర్నూలు జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పీ రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి సీ జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి పీ నారాయణస్వామి, సీ మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు సీ లింగమయ్య, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

తక్షణమే రైతులకు రూ.20 వేల సాయం

(మొదటిపేజీ తరువాయి)

లేక రైతులు నష్టపోయారన్నారు. ఇప్పటికిప్పుడు వర్షాలు కురిసినా సాగు చేసే పరిస్థితి లేదని, అందువల్ల ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ప్రభుత్వం సాయమందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి రెండు నెలలు అయినా ఇప్పటి వరకు ఒక్క పైసా ఇవ్వలేదని రామకృష్ణ చెప్పారు. తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉన్నాయని, అందువల్ల హంద్రీనీవా కెనాల్, పీఏబీఆర్ కెనాల్‌కి పూర్తిస్థాయిలో నీటినందించి చెరువులు నింపాలన్నారు. చెరువులు నిండితే తోట బావులు, మోటర్ బావులకు నీరు వచ్చి రైతులు పంటలు పెట్టుకోవడానికి వీలవుతుందన్నారు. వ్యవసాయ కూలీలకు యుద్ధ ప్రాతిపదికన ఉపాధి పనులు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విన్నవించారు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజగదీశ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు వైఎల్ రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు బల్లె నగేశ్, మన్నీల సీపీఐ నాయకులు వెంకట్ రాముడు, చిన్న వెంకటరాముడు, శివ, ఆంజనేయులు, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లు మృత్యు కుహరాలు

(మొదటిపేజీ తరువాయి)

వివరించాలని కేంద్రం, దిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కాగా... సెంట్రల్ దిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. దీనిపై విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నగరంలో విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారుల తీరును దిల్లీ హైకోర్టు ఇటీవల తీవ్రంగా తప్పుబట్టింది. ఉచితాలను ప్రోత్సహిస్తూ... పన్నులు వసూలు చేయకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతించి డ్రైనేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తే ఇలాంటి అనర్థాలకు దారితీస్తుందని పేర్కొంది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేసింది. ఈ క్రమంలోనే ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది.

ఆర్-5 జోన్ ఇళ్ల స్థలాలు వెనక్కి...

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంత రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఇళ్ల స్థలాల నిర్మాణం ఆపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తాజాగా సీఎం చంద్రబాబు వారందరికీ సొంత ప్రాంతం లేదా సమీపంలో వేరే స్థలాలు చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

నీటి హక్కుల పరిరక్షణ ముఖ్యం

- రైతు సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్
- జిల్లా కలెక్టరేట్లలో నేతల వినతులు

విశాలాంధ్ర-విజయనగరం/విజయవాడ: కృష్ణా, గోదావరి నదీ జలాల పున:పంపిణీ ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేసింది. నీటి పంపిణీలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించేది లేదని తెలిపింది. దీనిపై రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వినతిపత్రాలు అందజేసింది. కలెక్టర్ల ద్వారా సీఎం చంద్రబాబుకు వాటిని అందజేయాలని విన్నవించింది. విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికిగాను చంద్రబాబు చొరవతీసుకుని... తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావుకి ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు, జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేశ్, ఉపాధ్యక్షుడు పెయ్యల వెంకటేశ్వరరావు, జిల్లా రైతుసంఘం నాయకులు జి.దేవరాజు, పర్చూరి అజయ్, చెరుకూరి కుటుంబరావు, గుంజె వెంకయ్య తదితరులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రాన్ని సీఎం చంద్రబాబుకు పంపించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరారు. గోదావరి నీటి పంపిణీ విషయం చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఏలూరు జిల్లాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ ద్వారా సంక్రమించిన నీటి హక్కులను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల తాగునీటి అవసరాలకుగాను నాగార్జున సాగర్ నుంచి సకాలంలో నీటి పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతపురం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి చిరుతల మల్లికార్జున, పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, కర్నూలు జిల్లాలో రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం తతదితరులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

వయనాడ్ బాధితులకు సీపీఐ శ్రేణుల చేయూత

విశాలాంధ్ర-విజయనగరం: కేరళలో వయనాడ్ బాధితుల కోసం సీపీఐ విజయనగరం జిల్లా శాఖ ఆర్థిక సహాయం అందజేసింది. సోమవారం పార్టీ జిల్లా సర్వ సభ్య సమావేశం సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జ్ జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ వయనాడ్ బాధితులను ఆదుకోవాలని పార్టీ సభ్యులను కోరారు. ఈ మేరకు సభ్యులు అందజేసిన 3,547 రూపాయలను ఈశ్వరయ్య చేతుల మీదుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు అలమండ ఆనందరావు, బుగత అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, ఏఐఎస్ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, రాజాం నియోజక వర్గ సహాయ కార్యదర్శి నీలకంఠేశ్వం యాదవ్ పాల్గొన్నారు.

సీపీఐ నేత బత్తుల వెంకటేశ్వరరావు మృతి

విశాలాంధ్ర -నూజివీడు: సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల వెంకటేశ్వరరావు (55) సోమవారం సాయంత్రం 5 గంటలకు ఆకస్మికంగా మృతి చెందారు. మూడు రోజులుగా ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ఆదివారం ఏలూరులో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం 4:30 గంటలకు ఆకస్మికంగా అస్వస్థతకు గురికావడంతో ఆయనను నూజివీడు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకెళ్లాల్సిందిగా అక్కడి వైద్యులు సూచించారు. విజయవాడ తీసుకువెళుతుండగా అంబులెన్సులోనే వెంకటేశ్వరరావు కన్నుమూశారు. నూజివీడు తాలూకా దిగవల్లి గ్రామ యువజన సమాఖ్య కార్యకర్తగా పనిచేసి... కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. గ్రామంలో రాజకీయ కక్షల వల్ల నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. జైలు నుండి వచ్చిన తర్వాత పార్టీ పూర్తిస్థాయి కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన మృతికి నూజివీడు ఏరియా కమ్యూనిస్టు సమితి, ఏలూరు జిల్లా కమ్యూనిస్టు సమితి ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలియజేశాయి. మంగళవారం ఉదయం దిగవల్లి గ్రామంలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'ఉపాధి' బకాయిల చెల్లింపులో జాప్యమెందుకు?

- క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలి
- లేదంటే కలెక్టరేట్‌ల ముట్టడి: ఆవుల శేఖర్

విశాలాంధ్రబ్యూరో-కర్నూలు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీల డబ్బులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు పది వారాల డబ్బులు కూలీలకు చేతికి రాక అనేక అవస్థలు పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని, బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. ఈ పథకంలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికార పార్టీ రాజకీయ వేధింపులు మానుకోకపోతే భవిష్యత్‌లో కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా సమితి అధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకత్వం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు ధర్నాను ఉద్దేశించి ఆవుల శేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అయినప్పటికీ బకాయిలు చెల్లించడంలో ఆలస్యం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,100 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని తెలిపారు. చాలా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నిర్లక్ష్యంగా తొలగిస్తున్నారని, అధికార పార్టీలో ఉన్న వారిని తీసుకోవాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ తంతు కొనసాగుతున్నదని తెలిపారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలని, ఉపాధి సిబ్బందిపై అధికార పార్టీ రాజకీయ జోక్యం, వేధింపులు లేకుండా చూడాలని, వారి ఉద్యోగ భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు. 100 రోజులు పని పూర్తయిన ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, కేంద్రం నుంచి ఈ పథకం కింద రావాల్సిన సరిపడ నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబట్టాలని, 200 రోజులు పనిదినాలు పెంచాలని, రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, పనిచేసే ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మజ్జిగ, తాగునీరు, గుడారాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వేసవి అలవెన్స్‌ను తిరిగి పునరుద్ధరణ చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రెండు పూట్ల పని విధానం తీసివేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.నబి రసూల్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ కార్యదర్శి భాస్కర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు శేషుకుమార్, వెంకట్రాంరెడ్డి, వి.నాగరాజు, సహాయ కార్యదర్శి సోమేశ్వర్ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బిసన్న, డీహెచ్‌పీఎస్ నాయకులు కుమార్ రాజా, మహిళా సమాఖ్య నాయకురాలు కోటమ్మ, బీసమ్మ, అమీనాబి, బాబా, చిలిపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం

- డీఎస్సీ పరీక్ష ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ భవన్‌లో సోమవారం సంఘ జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన లెనిన్ బాబు మాట్లాడారు. నిరుద్యోగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించకపోవడం బాధాకరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శించారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడంతోనే గత వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి కూటమి ప్రభుత్వాన్ని యువత ఓట్లు వేసి గెలిపించారని గుర్తు చేశారు. నిరుద్యోగభృతి విషయంలో కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధిస్తుందని, ఎన్నికలకు ముందు అవేమీ చెప్పకుండా అధికారం చేపట్టిన తర్వాత ఆంక్షలు పెట్టడం సబబు కాదని చెప్పారు. షరతులు లేకుండా 45 ఏళ్ల వయసు వరకు గల నిరుద్యోగులందరికీ నిరుద్యోగభృతి అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. 16 వేల ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా లక్షల్లో అభ్యర్థులు ఉన్నారని వివరించారు. రోజులకొద్దీ ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం గందరగోళానికి దారి తీసే అవకాశం ఉందని, ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, జిల్లా ఆఫీస్ బేరర్స్ భీసన్న, రాజీవ్, శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్, హనుమేశ్, పెద్దయ్య, రాజు, అంజిత్ గౌడ్, జాఫర్, , చిరంజీవి, వినోద్, రంగప్ప చంటి, సురేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లా... నరక కూపాలా?

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సాయికుమార్

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కరువై... విద్యార్థులకు నరక కూపాల్లా మారాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ తెలిపారు. సోమవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య కృష్ణా జిల్లా సమితి అధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ వద్ద హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.వాణికి ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జులై 20 నుంచి 30వ తేదీ వరకు కృష్ణాజిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలన్నింటినీ సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నట్లు చెప్పారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా విద్యార్థినులకు నిద్రపోయేందుకు తగినన్ని గదులు లేకపోవడం, మరుగుదొడ్లు లేకపోవడాన్ని గుర్తించామన్నారు. శిథిలావస్థ భవనాల్లో హాస్టళ్లు ఉన్నాయని, అవి మూడు, నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదన్నారు. బాలికలకు శానిటరీ ప్యాడ్‌లను కూడా మూడు నెలల నుంచి అందించడం లేదని తెలిపారు. మెస్, కాస్మోటిక్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న కుక్, కమాటీ, వాచ్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలిపారు. మచిలీపట్నం వసతి గృహాల్లో విద్యార్థినులు 80 శాతం మంది కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న వారే అయినప్పటికీ వర్సిటీలు లోపలే వసతి గృహం ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమయ్యారని తెలిపారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడం వలన ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వసతి గృహాలకు కనీస వసతులు కల్పించాలని, శిథిలావస్థలో భవనాల్లో ఉన్న హాస్టళ్లను నూతన భవనాలకు మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కన్వీనర్ సాదిక్, నాయకులు సూరజ్, యువరాజ్, అనూష, జీవని, అమృత, సన్నీ, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు 100 రోజుల ప్రణాళిక

- పాలనలో పారదర్శకత పాటించండి
- సదస్సు ప్రారంభోత్సవంలో సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే 100 రోజుల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించిందని, దాన్ని కలెక్టర్లు సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరభ్ కుమార్ ప్రసాద్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, ప్రతిష్ఠ ఇనుమడింపజేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉందన్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణానికి ఎంతో కీలకమైందన్నారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వ పనితీరుకు అద్దంపడుతూ ప్రభుత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాల్సిన బాధ్యత అంతిమంగా కలెక్టర్లదేనని ఆయన చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలోను, సమస్యల పరిష్కారంలోను బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, ఒకవేళ మీ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే వాటిని ఆయా విభాగాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించాలని కోరారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కలెక్టర్లు చూపిన చొరవను అభినందిస్తున్నానని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగంతో ఎంతో సమన్వయంతో సంఘటితంగా పనిచేసి విజయవంతంగా పెన్షన్లు పంపిణీ చేశారన్నారు. ఇదే చొరవ స్ఫూర్తిని మిగిలిన ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా చూపాలని సూచించారు. రాబోయే వంద రోజుల ప్రణాళిక జిల్లాలు ఒక సఫలీకృతమై ప్రగతిపథంలో నడిచేలా కలెక్టర్లు పనిచేస్తారని సీఎస్ ఆకాంక్షించారు.

ఏపీ టెట్‌కు 4.27 లక్షల మంది దరఖాస్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2024)కు 4,27,300 మంది దరఖాస్తు చేసినట్టు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయరామరాజు సోమవారం వెల్లడించారు. ఎస్జీటీ పేపర్-1కు 1,82,609 మంది, ఎస్జీటీ (ప్రత్యేక విద్య) పేపర్-1(బీ) 2,662 మంది, స్కూల్ అసిస్టెంట్ టీచర్ పేపర్-2 (లాంగ్వేజెస్)కు 64,036, మ్యాథ్స్ అండ్ సైన్స్‌కు 1,04,788, సోషల్ స్టడీస్‌కు 70,767, స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక విద్య) పేపర్-2(బీ)కు 2,438 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల మూడో తేదీతో టెట్ దరఖాస్తులకు గడువు ముగిసింది. అక్టోబరు మూడో తేదీ నుంచి 20 వరకు టెట్ పరీక్షలను నిర్వహిస్తారు.

బీబీఏ, బీసీఏ కోర్సులకు ఫీజుల ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బీబీఏ, బీసీఏ కోర్సుల్లో ... ఉన్నత విద్యా ఫీజు నియంత్రణ కమిషన్ నిర్ధారించిన ఫీజులకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం గెజిట్ జారీజేసింది. 2024-25, 2025-26 విద్యా సంవత్సరానికిగాను 35 కళాశాలల్లో బీబీఏ, బీసీఏ కోర్సులకు ఏడాదికి రూ.18 వేల చొప్పున ఫీజులను ఖరారు చేశారు. పీవీ కృష్ణకిశోర్ డిగ్రీ కళాశాల(అనంతపురం)లో బీఎస్సీ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుకు ఏడాదికి రూ.30 వేల చొప్పున ఫీజులు ఖరారు చేశారు.

ఎంటెక్‌కు రూ.50 వేలు: రాష్ట్రంలో మూడు ప్రైవేట్, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో ఎంటెక్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఏడాదికి కన్వీనర్ కోటా కింద రూ.50 వేల చొప్పున ఫీజు ఖరారు చేశారు. ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నాలజీ-విజయవాడ, గోకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్-విజయనగరం, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల-విజయవాడకు రూ. 50 వేల చొప్పున ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

నేను తప్పు చేసినా సరిదిద్దుకుంటా

- సూపర్ సిక్స్ హామీకి కట్టుబడి ఉన్నాం
- వికసిత ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం
- త్వరలో ప్రభుత్వ యాప్: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'నేను తప్పు చేసినా సరిదిద్దుకుంటా... మీరూ సరిదిద్దుకోవాలి' అని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సింపుల్ గవర్నెన్స్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఉండాలని అన్నారు. నేను పర్యటనలకు వచ్చినప్పుడు చెట్లు నరికేయడం, పరదాలు కట్టడం, పాఠశాలల మూసివేయడం, రెడ్ కార్పెట్లు వేయడం లాంటివి చేయకూడద న్నారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో వివిధ అంశాలపై సీఎం మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడంలో ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దు అని, ఎమ్మెల్యేలు సైరెన్ వేసుకోవడం వంటివి ప్రజల్లో వ్యతిరేకత కలిగించేవని కలెక్టర్లకు సూచించారు. వికసిత ఆంధ్రప్రదేశ్ మన లక్ష్యం కావాలని, కలెక్టర్లు కూడా డిస్ట్రిక్ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలన్నారు. నాడు విజన్ 2020ని అప్పట్లో ఎగతాళి చేసినా, తాము చేసి చూపించామన్నారు. అదే దిశగా నూతన విజన్ ఆలోచించాలని సూచించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడు శ్వేత పత్రాలు విడుదల చేశామని, మాకు వచ్చిన ఐదు వేల ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలకు సంబంధించినవి ఉన్నాయని సీఎం వివరించారు. తొలి మంత్రి మండలిలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేశామని, సర్వేను హోల్డ్‌లో పెట్టామన్నారు. సర్వే రాళ్లపై ఫోటో పెట్టుకోవాలనుకోవడం తగదని మండిపడ్డారు. పట్టాదారు పాస్ పుస్తకాలలో ఫోటో పెట్టుకోవడం అన్యాయమని, వారసత్వ ఆస్తులపై ఫోటోలు ముద్రించుకోవడం దుర్మార్గమని అన్నారు. నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో 15వేల సీసీ కెమెరాలు రాష్ట్రంలో పెట్టామని, మారుమూల గ్రామంలో కూర్చొని బెస్ట్ కంపెనీ క్రియేట్ చేసి గ్లోబల్‌గా తీసుకెళ్లే పరిస్థితులు వచ్చాయని గుర్తుచేశారు. వర్చువల్ గవర్నెన్స్ రావాలని, అధికారులు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. టీసీఎస్ కంపెనీలో ఒక గ్రూప్ ఉందని, అందులో అందరూ ఉండి సమన్వయం చేసుకుంటారని సీఎం ఉదాహరించారు. త్వరలో ప్రభుత్వానికీ ఒక యాప్ తీసుకొస్తామని, అప్పుడే నిజమైన పరిపాలన అవకాశం వస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. భట్టిప్రోలు ఘటనలో ఒక కార్యకర్త ఎస్ఐ చొక్కా పట్టుకున్నారని కల్పిత కథనం రాశారని, మనం వాస్తవాలు వెల్లడించకపోతే...ప్రజలు నిజమనుకునే అవకాశముందన్నారు. తప్పు చేస్తే ఎవరినీ వదిలిపెట్టేదీ లేదని స్పష్టం చేశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి ధర్నా చేసి ఏపీలో 36 మందిని చంపామని నినదించారని, నిజంగా అలా జరిగి ఉంటే ఎఫ్ఐఆర్‌లు ఇవ్వాలన్నారు. ఎఫ్ఐఆర్ ఇవ్వమంటే ఎందుకు ఇవ్వడం లేదు... ఆధారాలుంటే చూపించాలంటూ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వంపై ఇలా వ్యతిరేకత సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సూపర్ సిక్స్ హామీలకు కట్టుబడి ఉన్నామని, ఈనెల 15న అన్న క్యాంటీన్లను పెట్టబోతున్నామని వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టో అందరి దగ్గరా ఉంటుందని, ఆర్థికేతర సమస్యలను ముందుగా పరిష్కరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాలని, తద్వారా మంచి మార్పు వస్తుందని సూచించారు. త్వరలోనే మళ్లీ 1995 చంద్రబాబు చూస్తారన్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు, మురుగు కాల్వల పరిశీలనకూ వెళ్తానని సీఎం వెల్లడించారు. అధికారులు ప్రజల కనీస అవసరాలను గుర్తించాలని, నాడు హైదరాబాద్, ఐటీ అభివృద్ధిని అధికారులే చేశారని గుర్తుచేశారు. గ్యాస్, వీధి దీపాలు, రహదారులు తదితర సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంత పెట్టుబడులు పెట్టారనేదీ కాదనీ...ఎంత మందికి ఉపాధి కల్పించామన్నదే ముఖ్యమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో నదుల అనుసంధానం జరగాలని, ప్రతి ఎకరాకు నీళ్లు అందించాలని, తద్వారా ఆర్థిక పరిపుష్టి జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కష్టపడే తత్వం, పని సులువ, మంచి ఆలోచనలే మన నినాదం కావాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

పేదవాడికి న్యాయం జరిగేలా భూసేకరణ చట్ట సవరణ: అనగాని

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేదవాడికి న్యాయం జరిగేలా ఏపీ భూసేకరణ చట్టాన్ని సవరించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... 1982 ఏపీ భూసేకరణ చట్టాన్ని అనుసరించి గుజరాత్ రాష్ట్రంలో కఠినమైన నియమ నిబంధనలు, జరిమానాలను రూపొందించడం జరిగిందన్నారు. పేద వాడికి అన్యాయం జరుగకుండా వాటి కంటే మరింత కఠినమైన నియమ నిబంధనలు, జరిమానాలతో ఏపీ భూసేకరణ చట్టాన్ని సవరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో దాదాపు తొమ్మిది లక్షల ఎకరాల ఎస్సైన్డు భూములను ఫ్రీ హోల్డుగా మార్చడమే కాకుండా దాదాపు 25 వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ కూడా చేయించుకోవడం జరిగిందని చెప్పారు. ఈ అంశంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సామాన్య మానవుడికి న్యాయం జరిగే విధంగా ఈ వ్యవస్థను గాడిలో పెట్టాలని అనగాని కోరారు. గత పాలకులు చేసిన అరాచకాలు బయట పడకుండా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లను దగ్ధం చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రీ-సర్వేను కొనసాగించినా, నిలుపుదల చేసినా సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ విషయంలో గ్రామ సదస్సుల నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల్లో 80 శాతం పైగా రెవెన్యూకు సంబంధించినవే ఉంటున్నాయని అన్నారు. .

చేనేతల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-మంగళగిరి: దేశంలో చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేనేత జౌళి శాఖ రాష్ట్ర మంత్రి సవితను ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం నాయకులు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేనేతలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను మంత్రి దృష్టికి నాయకులు తీసుకువచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే చేనేతపై జీఎస్టీని ఎత్తివేసే విధంగా, రిజర్వేషన్ యాక్ట్‌ను కఠినంగా అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని మంత్రి తెలిపారని నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మంత్రి సవితకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుగుడే మాధవస్వామి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు జొన్నాదుల భారతి, కడుపు కన్నయ్య, పంచుల హరి, సహాయ కార్యదర్శులు గొట్టుముక్కల బాలాజీ, పీతాంబరధరరావు, సంఘం మాజీ అధ్యక్షులు కట్టా హేమచంద్రరావు, రాష్ట్ర సమితి సభ్యులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, కొండాలి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైకోర్టు
అమరావతి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వినియోగించేందుకు **25 ల్యాప్‌టాప్‌లు, వాటి ఉపకరణాలు**, సరఫరా, పంపిణీ, ఏర్పాటు నిమిత్తం **'టెండర్స్'** శీర్షికన హైకోర్టుల వెబ్‌సైట్ http://aphc.gov.in క్రింద సీల్ వేసిన కొటేషన్లు ఆహ్వానించబడుతున్నాయి. ఆసక్తి కలిగిన బిడ్డర్లు తదుపరి సమాచారం కోసం పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించగలరు. సంప్రదించవలసిన **ఫోన్ నెం. 0863-2372727.**

సం/- రిజిస్ట్రార్ (ఐటి-కమ్- సెంట్రల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్)
DIPR/13822/CL/ADVT-1/1/2021-22 Dt. 05-08-2024

సంపాదకీయం

ప్రజాస్వామ్యం ఖూనీ ఫలితం

ప్రజాస్వామ్య పద్ధతుల్లో అధికారం చేపట్టి, ఆ తరవాత ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అనుసరించి ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ పాలన నడిపే అందరు పాలకులకు ఒకే రకమైన గతి పట్టుందేమో. పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో పదిహేనేళ్ల నుంచి నిరాఘాటంగా ప్రధానమంత్రిగా కొనసాగిన షేక్ హసీనా పాలనా కాలం పెరిగే కొద్దీ ఆమె నిరంకుశత్వం చెలాయించడం కూడా విపరీతంగా పెరిగింది. రిజర్వేషన్ల వివాదంపై చివరకు సోమవారం హసీనా విధిలేని పరిస్థితుల్లోనే కాదు అవమానకరమైన రీతిలో రాజీనామా చేయవలసి వచ్చింది. అక్కడితో కూడా ఆగలేదు. దేశం వదిలి వెళ్లాల్సి వచ్చింది. దేశ విభజన తరవాత పశ్చిమ పాకిస్తాన్ దాష్టీకాన్ని వ్యతిరేకించి 1971లో స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణకు మహోద్యమం నడిపిన షేక్ ముజీబుర్ రహమాన్ కూతురు షేక్ హసీనా నియంతగా మారడం వైపరీత్యాల్లోకెల్లా వైపరీత్యం. బంగ్లాదేశ్‌లో ఎలాంటి ప్రభుత్వం ఏర్పడబోతోంది అన్నది ఇంకా స్పష్టం కాలేదు. షేక్ హసీనా రాజీనామా చేయగానే నిరసనకారులతో సైన్యాధిపతి చర్చలు ప్రారంభించారు. గతంలోలాగా ప్రధానమంత్రి స్థానంలో ఉన్న హసీనాను బలవంతాన పదవి నుంచి తొలగించి సైన్యం ఈ సారి అధికారం చేజిక్కించుకోలేదు. మళ్లీ పౌర ప్రభుత్వం ఏర్పడడానికే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భవిష్యత్ ప్రభుత్వం ఎలా ఉంటుంది అన్న విషయాన్ని పక్కన పెట్టినా హసీనా పదిహేనేళ్ల పాలనలో ప్రజాస్వామ్య ఛాయలు కలికానికి కూడా లేవన్న ఆరోపణ తాజాగా వినిపిస్తోంది. ప్రజలలో గూడుకట్టుకున్న ఆగ్రహం గత నెల మధ్య నుంచి అగ్నిపర్వతంలా బద్దలైంది. బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగవంతంగా పెరుగుతోందంటున్నారు. గత పదేళ్ల కాలంలో తలసరి ఆదాయం మూడు రెట్లు అయిందంటున్నారు. రాజకీయాలకు మూలాధారం ఆర్థికాంశాలే అయినా కేవలం దేశం ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించడం మాత్రమే ప్రజా సంక్షేమానికి కొలమానం కాదు. 17 కోట్ల జనాభా ఉన్న బంగ్లాదేశ్‌లో మూడింట రెండువంతులమంది యువకులే. వారి ప్రధాన సమస్య నిరుద్యోగం. ఈ అంశాన్ని హసీనా ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా ఆమె పౌరుల హక్కులన్నింటినీ లాగేశారు. సర్వాధికారాలు ఆమె గుప్పెట్లోనే ఉండేవి. కోర్టులూ ఆమె ఎదుట మోకరిల్లాయి. ఏ స్థాయిలోనూ ఎన్నికలు నిర్వహించలేదు. ప్రజాస్వామ్యం పీకే నొక్కేశారు. పోలీసు బలగాల మీదే ప్రధానంగా ఆధారపడ్డారు. హసీనా అండచూసుకుని పోలీసు బలగాల్లో అవినీతి తారస్థాయికి చేరింది. సైన్యంలోనూ అవినీతి పెరిగిపోయింది. పోలీసు విభాగం అధిపతి, సైన్యాధిపతి భయంకరంగా సంపద కొల్లగొట్టారు. ప్రజలకు భద్రత లేకుండా పోయింది. భవిష్యత్తు అంధకారమయమైంది. గత పదిహేను రోజులకుపైనుంచి దేశమంతటా పాఠశాలలు, కళాశాలలు మూసేశారు. మొబైల్ ఫోన్లు పలకకుండా చేశారు. ఇంటర్నెట్ సదుపాయం లేకుండా చేశారు. నిరసన ప్రదర్శనలు మొదట్లో శాంతియుతంగానే కొనసాగాయి. కానీ ప్రభుత్వం చలించకపోవడంతో నిరసనలు హింసా మార్గం పట్టాయి. హసీనా అసలు సమస్యను పరిష్కరించడానికి బదులు పోలీసు, సైనిక బలగాలను దించి భయానకమైన వాతావరణం సృష్టించి నిరసన తీవ్రం కావడానికి కారకులయ్యారు. రోడ్లపైన అన్ని చోట్లా సైనికులను, ఇతర భద్రతా దళాలను మోహరించారు. కర్ఫ్యూ విధించారు.

ఆందోళనకు దారితీసిన రిజర్వేషన్ల సమస్య ప్రత్యేకమైంది. అక్కడ 56 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అయితే మన దేశంలో లాంటి రిజర్వేషన్లు కావు. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించడానికి పోరాడిన స్వాతంత్ర్య సమర యోధులకు 30 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను పరిగణించి వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం అభ్యంతరకరమైంది కాదు. కానీ 1997లో ఈ రిజర్వేషన్లను స్వాతంత్ర్య సమర యోధుల సంతానానికి, 2010లో వారి సంతానానికీ హసీన వర్తింప చేశారు. స్వాతంత్ర్యంకోసం ప్రధానంగా పోరాడింది హసీనా నాయకత్వంలోని అవామీ లీగే కనక వీటి ప్రయోజనం ఆ పార్టీ వారికే ఎక్కువగా దక్కింది. 10 శాతం మహిళలకు, 10 శాతం వెనుకబడిన ప్రాంతాలకు చెందిన వారికి, 5 శాతం మైనారిటీలకు, ఒక శాతం దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించారు. అంటే కేవలం ప్రతిభ ఆధారంగా ప్రభుత్వోద్యోగాలు సంపాదించాలనుకునే వారికి మిగిలింది కేవలం 44 శాతం మాత్రమే. ఇది కూడా నిజానికి జనాగ్రహానికి కారణం కాదు. స్వాతంత్ర్య సమరయోధుల మనవలకు, మనవరాళ్లకు కూడా రిజర్వేషన్లు కల్పించడం కేవలం అధికారంలో ఉన్న అవామీ లీగ్ వారికే దక్కుతూ ఉండడం నిరసనకు ప్రధాన కారణమైంది. 2018లో ఏడుగురు విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల మనవలకు, మనవరాళ్లకు రిజర్వేషన్లు కల్పించడాన్ని సవాలు చేస్తూ హైకోర్టుకెక్కారు. గత జూన్ అయిదున హై కోర్టు ఈ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. హసీనా సర్కారు దీన్ని మన్నించకపోవడంతో నిరసన జ్వాలలు లావాలా ఎగిసిపడ్డాయి. ఈ రిజర్వేషన్లను అమలు చేయడంలో విపరీతమైన అవినీతి కూడా ఉందంటున్నారు. హై కోర్టు తీర్పును సవాలు చేస్తూ హసీనా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. అనుచితం అనుకుంటున్న రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వీధులకు ఎక్కిన యువతకు క్రమంగా భిన్నవర్గాల మద్దతు సమకూరింది. వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కడకు ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ కూడా ఉద్యమంలో భాగమయ్యాయి. ఒక రకంగా చెప్పాలంటే సమర్థకులను మినహాయిస్తే దేశవాసులందరూ హసీనాకు వ్యతిరేకంగా గొంతెత్తారు. క్రమంగా ఉద్యమం హింసాత్మకమైంది. అదీ హసీనా నిర్వకమే. ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షతతో కూడిన విధానాలను నిరసించే వారితో సంప్రదింపులు జరపడానికి బదులు హసీనా మరింత నిరంకుశంగా మారారు. సకల ప్రజాస్వామ్య విధానాలను తుంగలో తొక్కారు. దేశం అట్టుడికి పోయింది. సర్వత్రా సంక్షోభం నెలకొంది. చివరకు పరిస్థితి ఎక్కడిదాకా వెళ్లిందంటే దేశ నలుమూలల నుంచి జనం ప్రధానమంత్రి హసీనా ఇంటిని ముట్టడించడానికి తరలి వచ్చారు. నిరసనకారులు కనిపిస్తే కాల్చేయాలని హసీనా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయడానికి సైన్యం కూడా నిరాకరించింది. సైన్యంలో సగ భాగం హసీనా అంటే విముఖంగా ఉన్నట్టు కనిపిస్తోంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలను పడదోయడం కొత్త కాదు. ఇంతవరకు 29సార్లు సైనిక తిరుగుబాట్లు జరిగాయి. సైన్యాధిపతులు అధికారం చేపట్టిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. కానీ తాజాగా హసీనా రాజీనామా చేయడానికి ప్రధాన కారణం ప్రజాగ్రహం కట్టలు తెంచుకోవడమే. అంటే జనమే హసీనా సర్కారును పడదోశారు. బంగ్లాదేశ్‌లో పరిణామాల ప్రభావం మన దేశం మీద కూడా ఉంటుంది. బంగ్లా అవతరణకు సాయపడింది మన దేశమే. హసీనాతో మన ప్రభుత్వానికి సంబంధాలు బాగానే ఉన్నాయనే వారు. కానీ అక్కడి అంతర్గత రాజకీయాలను గమనించే శక్తిని ఈ "సత్సంబంధాలు" కోల్పోయేట్టు చేశాయేమో! బంగ్లాదేశ్‌తో మనకు 2,200 కి.మీ. మేర సరిహద్దు ఉంది. అందువల్ల పరిస్థితిని జాగ్రత్తగా గమనించడం అవసరం.

నేరం నాది కాదు

చింతపట్ల సుదర్శన్

నమిలిందే ఎంతసేపు నమలడం. ఎంత నమిలినా నోటికి వచ్చిందేమీ లేదు, పళ్ల నొప్పులు తప్ప. ఈ మధ్య ఎముకకు ఏమాత్రం మాంసం మిగలకుండా పూర్తిగా గీకేసి పారేస్తున్నాడు అనుకున్న డాగీ, ఎముక విసిరేసి రోడ్డంట తిరుగసాగింది. కడుపులో ఎలుకలు టెన్నిస్ ఆడుకుంటున్నట్టుంది కాదు, ఫుట్‌బాల్ ఆడుకుంటున్నట్టుంది అనుకుంటూ నీరసంగా నడుస్తున్నప్పుడు కనపడింది అది. అదేమిటంటే ఓ బ్రెడ్డు ప్యాకెట్టు. బ్రెడ్డు ప్యాకెట్ గాలిలో ఎగుర్తూ కనపడదు కదా. ఓ అమ్మాయి ఎడమచేతిలో కదుల్తున్నది. ఆ అమ్మాయి కుడిచేతిలో సెల్‌ఫోన్ ఉంది. అమ్మాయి ఎడం చేతిలో ఊగులాడ్తున్న పాకెట్ చూడగానే డాగీ నాలుక నుంచి నీళ్లూర సాగినయి.

ఎలా? ఎలా? ఎలా? ఎలాగో అలా ఆ బ్రెడ్డు దక్కించుకుంటే కడుపును 'శాంతినికేతన్' చెయ్యవచ్చు అనుకుంది డాగీ. కుక్కే కాని నక్కలా నక్కుతూ ఆ అమ్మాయిని అనుసరించింది. అవకాశాలు వాటంతట అవి రావు, కష్టపడి సంపాదించుకోవాలి అని ఓపిగ్గా, నిశ్శబ్దంగా అనుసరించింది. అమ్మాయి కన్నూ, చెవీ సెల్‌ఫోన్‌లో ఉన్నవి. మరో చేత

రంగస్థలం

పట్టుకున్న బ్రెడ్డు ప్యాకెట్ మీద ధ్యాస లేనట్టున్నది. మంచి తరుణం మించిన దొరకదు అనుకున్న డాగీ చుట్టూ చూసింది. సమీపంలో నర మానవ మనుష్యుడెవ్వడూ లేడు. వేగంపెంచింది. పరుగెడ్తూనే నాలుగు కాళ్లూ ఎత్తి జంపు చేసింది. అమ్మాయి చేతిలో ఉన్న ప్యాకెట్టు నోటితో అందుకుని కుక్కే అయినా, రేసు గుర్రంలా పరుగెట్టింది. అమ్మాయి 'షాక్' తగిలినట్టు నిలబడిపోయింది ఫోను మాత్రం వదలకుండా గట్టిగా పట్టుకుంది. అప్పుడే ఆ వైపు వచ్చి అంతా చూసిన ఓ ముసలమ్మ 'బ్రెడ్డు పోతే పోయింది కరవలేదు నయం ఇంజక్షన్లు పొడిపించుకోవల్సి వచ్చేది' అని అమ్మాయిని ఊరడించింది.

వెనక్కి తిరిగి చూడకుండా, నోట కరిచిన బ్రెడ్డు ప్యాకెట్ జారిపోకుండా వచ్చి అరుగు ఎక్కింది డాగీ. అప్పుడే అరుగు ఎక్కి రెస్టు తీసుకుంటున్న డాంకీకి డాగీ నోటి నిండా పట్టుకు వచ్చిందేమిటో అర్థం కాలేదు. బ్రెడ్డు ప్యాకెట్టు చించడానికి తంటాలు పడసాగింది డాగీ. ఏంటి 'బ్రో' కొట్టులోంచి కొట్టుకు వచ్చావా అంది డాంకీ. అప్పటికి ప్యాకెట్ చించేయడంతో హుషారుగా ఉంది డాగీ. కొట్టులోంచి కాదు, ఓ సెల్లున్న అమ్మాయి చేతినుంచి కొట్టుకొచ్చా అంది. దొంగతనం పాపం కదా. దొంగల్ని పట్టుకోవలసిన కుక్కే దొంగయితే కంచే చేను మేసినట్టు కాదా అంది డాంకీ. నేరం నాది కాదు ఆకలిది. రోటీ, కపడా, మకాన్ హక్కు మనుషులకేనా, నాలుక్కాళ్ల జీవాలకు లేవా అని కోప్పడింది డాగీ. తల నుండు విషము ఫణికి, తోక నుండు వృశ్చికమునకు, మనిషికి నిలువెల్ల విషము అని నాకూ తెల్సు కానీ మనుషులు నీతి తప్పడం మామూలేకద. మనం మన సహజ గుణాలను వదులుకో రాదు మరి అంది డాంకీ పళ్లికిలిస్తూ.

అప్పుడొచ్చాడు అబ్బాయి. అప్పటికి ఐదారు బ్రెడ్డు స్లయిసులు నమిలి స్థిమితపడ్డది డాగీ. చూడు 'బ్రో' ఆకలి బాధ తట్టుకోలేక ఆత్మనూ, కడుపునూ క్షోభ పెట్టలేక ఓ బ్రెడ్డు పాకెట్టు, అదీ సెల్‌ఫోన్ మైకంలో నడిచెళ్తున్న అమ్మాయి చేతిలోంచి లాక్కు వచ్చానని, మనుధర్మ శాస్త్రం చదివి వినిపిస్తున్నది డాంకీ అని కంప్లయింటు చేసింది డాగీ. అదికాదు తంబీ, ఈ డాగీ ఏం చేసిందంటే అని చెప్పబోతున్న డాంకీని మధ్యలో ఆపి, నాకంతా తెల్సు డాగీ నోటంట చొంగ కారుస్తూ అమ్మాయి వెంట పరుగెత్తడం నేను చూశా, తర్వాత జరిగింది ఊహించగలను. ఇదేం పెద్ద పాపం అనిపించదు నాకు. అధికారంలో ఉన్న పార్టీలోకి జొరబడితే, ఏదైనా పదవి దక్కదా, మెక్కడానికి సొమ్ము చిక్కదా అని, ఇతర పార్టీ ప్రజాప్రతినిధులు చొంగ కారుస్తూ, అవకాశం కోసం అర్రులు చాచటం గుర్తుకు వస్తోంది. చదువూ, తెలివీ అన్నీ ఉన్న మనుషులే జంపు జిలానీలవడానికి చొంగ కారుస్తూ, లేని తోకలు ఊపుతూ, ఉరుకులూ పరుగులూ పెడ్తుంటే, కేవలం ఒక్క పూట కడుపు నింపుకోడానికి డాగీ చేసింది, నరకంలో పామాయిల్‌లో వేయించాల్సిన తప్పేం కాదు, పార్టీలు మార్చి, ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి దూరి, కాళ్లు పట్టుకునే మనుషుల్ని పొయ్యిలో పెట్టాలసలు అన్నాడు అబ్బాయి.

పట్టుమని పన్నెండు మంది లేని పార్టీ కూడా ప్రతిపక్ష హోదా అడగడమంటే అర్థం ఏమిటి, ఏదో ఒక హోదా పదవీ లేకుండా ఏ నేతా ప్రశాంతంగా బతకలేడనే కదా అంది డాగీ. ప్రతిపక్షంలో ఒకవేళ ఏ పార్టీ వాళ్లన్నా మిగిలితే, ప్రజల సమస్యల్ని గాలికి వదిలి బురదా, దుమ్మూ ఎత్తిపోయడమే పనిగా పెట్టుకుంటున్నారు. వాళ్లూ, వీళ్లూ నోళ్లు నొప్పి పుట్టేట్టు తిట్టుకుంటున్నారు. దీన్ని బట్టి తెలిసేదేమిటి పదవి లేకుండా ఏ రాజకీయ నాయకుడూ ఒక్క రోజు కూడా ఉండలేడని, ఐదేళ్లు ఆగే ఓపిక అసలు ఎవరికీ ఉండదని అన్నాడు అబ్బాయి.

పరమత సహనమూ లేదు, పర పార్టీ సహనమూ లేదు, ప్రజల సమస్యలు పట్టవు. అధికారంలో ఉన్నవాడ్ని కిందికి లాగడమే, తక్షణ కర్తవ్యం, మన ఘనత వహించిన నాయకులకి అన్నది డాంకీ.

కోట్లకి కోట్లు కుంభకోణం చెయ్యలేదు. ఆకలికి తట్టుకోలేక నాలుగు బ్రెడ్డు స్లైసుల కోసం దొంగ కార్చాను తప్పా అంది డాగీ.

బ్యాంకుల విధ్వంసానికి మోదీ రెడీ

అమర్‌జిత్ కౌర్
ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1969లో ప్రధాని ఇందిరాగాంధీ చేసిన బ్యాంకుల జాతీయకరణ దేశానికి, ప్రజలకు దాదాపు సర్వరంగాలకు ఉపయోగపడింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వంలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పూనుకున్నది. జాతీయం చేయగా రైతులకు, వృత్తి కళాకారులకు, అణగారిన వర్గాల ప్రజలకు చిన్న వ్యాపారాలకు, సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు, విద్యార్థులకు, యువకులకు, బ్యాంకుల్లో విభిన్న తరగతుల ప్రజలకు, మహిళలకు ఉద్యోగాలను కల్పించడానికి రుణాలు ప్రభుత్వరంగ బ్యాంకులు ఉపయోగపడ్డాయి. బ్యాంకింగ్ వ్యవస్థ సంపన్నులకు, బడా వ్యాపారులకు, పెద్దపరిశ్రమలకు రుణాలు అందచేసింది.

ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించడం, ప్రైవేటీకరించడం వీలైతే విక్రయించడం, ప్రభుత్వ సేవలను కార్పొరేట్ స్నేహితులకు అందించడం నిరంతరం కొనసాగుతున్నది. కరోనా మహమ్మారి కాలంలో ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కనీసం నిరసన తెలియజేయటానికి వీలులేకుండా విపత్తుల నిర్వహణచట్టాన్ని అమలు చేయడం ద్వారా ఆంక్షలు విధించింది. మోదీ ప్రభుత్వ హయాంలో 16లక్షల కోట్ల రుణబకాయిలను రద్దుచేసి బడా సంపన్నులకు ఎంతగానో తోడ్పడింది. బ్యాంకులకు రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోయిన అనేకమంది సంపన్నులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే అనేక బ్యాంకులను విలీనంచేశారు. ఫలితంగా అనేకమంది ఉద్యోగులు, ఖాతాదారులు, బ్యాంకుల విలీనం మూలంగా ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. రెండు బ్యాంకులను ప్రైవేటీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవసాయరంగాన్ని దెబ్బతీసేందుకు మూడు సాగు దుష్టచట్టాలను చేసింది. రాజ్యసభ నుంచి 8మంది ఎంపీలను బలవంతంగా బైటకుపంపి ఈ చట్టాన్ని ఆమోదించారు. మూడు కార్మిక కోడ్‌లను ఆమోదించి అంతక్రితం ఉన్న దాదాపు 40పైగా చట్టాలను రద్దు చేశారు. కార్మికరంగంపై కక్షకట్టినట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

మోదీ గత పదేళ్లకాలంలో సామాజిక వ్యవస్థను ధ్వంసం చేశారు. బీజేపీపై పెత్తనం చెలాయిస్తున్న ఆర్ఎస్ఎస్ ఏనాడూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదు. స్వాతంత్ర్య పోరాటంలో ఆమోదించిన త్రివర్ణపతాకాన్ని ఆర్ఎస్ఎస్ ఆమోదించలేదు. నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఇంతవరకు ఎగురవేయలేదు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ పాల్గొనకుండా దాన్ని వ్యతిరేకించింది. బ్రిటీష్ పాలకులు అనుసరించిన విభజించి, పాలించు సూత్రీకరణను ఇప్పటి ప్రభుత్వం అనుసరిస్తోంది. సమాజంలో మత విభజనకు అన్ని విధాలుగా పనిచేస్తున్నారు. దేశ విభజన సమయంలో మతోన్మాదుల, వివిధ మతవాదులు, ఒక గ్రూపుపై మరో గ్రూపు విచ్చలవిడిగా దౌర్జన్యాలతో హత్యాకాండకు పూనుకోవడంతో రక్తం

THE TIMES OF INDIA

14 TOP BANKS ARE NATIONALISED

Ordinance follows unanimous Cabinet decision

'Syndicate' in disarray as Morarji goes

Kamaraj, Chavan happy

Nationalised banks

Assam flood worsens: heavy havoc

ఏరులైపారింది. స్వాతంత్ర్యోద్యమంకోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారు. తమ ఆస్తులను పోరాటాలకోసం ఇచ్చారు. విదేశీ పాలనను రైతులు గట్టిగా వ్యతిరేకించి పోరాటంలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాకారులు, జర్నలిస్టులు అనేకరంగాల ప్రజలు మహత్తర స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఈ దశలోనే ట్రేడ్‌యూనియన్ ఉద్యమం ఏఐటీయూసీ నాయకత్వంలో రూపుదిద్దుకుంది. 1920లో ఏఐటీయూసీని స్థాపించారు. రష్యాలో అక్టోబరు విప్లవం విజయం సాధించిన తరుణంలో ఏఐటీయూసీ ఏర్పడింది. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కార్మికవర్గ ఉద్యమం ప్రపంచమంతటా ఊపు అందుకుంది. 1925లో కమ్యూనిస్టు గ్రూపులన్నీ కలిసి భారత కమ్యూనిస్టుపార్టీగా కాన్పూర్‌లో స్థాపించారు.

దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమాలు విద్యార్థులను, యువకులను ఎంతగానో ప్రోత్సహించాయి. వారంతా కలిసి స్వాతంత్ర్య పోరాటాల్ని మరింత విస్తరించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు బ్యాంకులతో సహా అన్ని రంగాలలో యూనియన్లు ఏర్పాటు చేయడం ప్రారంభించారు. స్వాతంత్ర్యం తరువాత ఏర్పడిన ప్రభుత్వం తీవ్ర పేదరికం, ఆకలి, నిరక్షరాస్యత, ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంకోసం అనేక ప్రణాళికలు రూపొందించి అమలు జరిపింది. సహజవనరులు, వీటినుంచి వచ్చిన ఆస్తులు ప్రజలకు చెందినవని ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ సంపదను ప్రజల సంక్షేమంకోసం వినియోగించాలని ప్రభుత్వం నిశ్చయించింది. బ్యాంకుల మోసాలకు గురైన వారికి ఏఐటీయూసీ నాయకత్వంలోని యూనియన్లు పోరాటంచేసి ఆదుకున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థ సాధారణ ప్రజలకు ఉపయోగపడాలని ఏఐబీఈఏ నాయకత్వంలో పోరాటం చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐబీఈఏ అనేక పోరాటాలు చేపట్టింది. ఉద్యోగులు సమస్యలపై 23సంవత్సరాలుగా పోరాటం జరుగుతూనే ఉంది. కార్మికవర్గ పోరాటాలకు భారత కమ్యూనిస్టుపార్టీ అండగా నిలిచింది. కార్మికవర్గం, రైతులు, సామాన్యులు తమ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష పార్టీల సహాయాలను కోరుతూ వారు చేస్తున్న పోరాటాలకు మద్దతునిస్తున్నారు. భారతీయ జనసంఘ్‌పార్టీ బీజేపీగా ఏర్పడింది. ప్రజాపంపిణీ వ్యవస్థను, భూసంస్కరణలను జమిందార్లు, సంస్థానాధీశులకు ఇస్తున్న రాజభరణాల రద్దును జనసంఘ్ వ్యతిరేకించింది.

బ్యాంకుల జాతీయాకరణ కొనసాగింపును బీజేపీ వ్యతిరేకిస్తోంది. పార్లమెంటు చర్చల్లో జాతీయాకరణను కొనసాగించడం బీజేపీకి ఇష్టంలేదని స్పష్టమవుతోంది. ప్రభుత్వరంగ పరిశ్రమలను కూడా అది వ్యతిరేకిస్తోంది. బ్యాంకుల జాతీయాకరణను వ్యతిరేకిస్తూ గతంలో భారతీయ జనసంఘ్‌గా ఉన్నప్పుడు పార్టీ నాయకుడు ఒకరు కోర్టుకు వెళ్లారు. దేశ సంక్షేమంకోసం బ్యాంకుల జాతీయకరణ అమలు చేయాలని పార్లమెంటు ఆమోదించింది. 1990ల మధ్యకాలంలో గాట్‌ను రద్దు చేశారు. దాని స్థానంలో ప్రపంచ వాణిజ్యసంస్థను ఏర్పాటుచేశారు. వివిధ దేశాలు అభివృద్ధి కోసం సహాయం పొందడానికి ఈ సంస్థ అనేక ఆంక్షలు విధించింది. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు 1990ల ప్రారంభంనుంచి మనదేశంలో అమలయ్యాయి. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ తరఫున ప్రపంచ పెట్టుబడీదారీ విధానం, వ్యవస్థీకృత సర్దుబాటు కార్యక్రమాలు తదితర ముందు షరతులను విధించి అభివృద్ధి నిధులను పొందవచ్చునని ప్రపంచ వాణిజ్యసంస్థ ప్రకటించింది. అంతేకాదు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రభుత్వ సేవలను, సంక్షేమ కార్యక్రమాల అమలును నిలిపివేయాలని ఈ సంస్థ కఠినమైన ఆంక్షలను విధించింది. ఈ సంస్థ విధించిన ఆంక్షలలో బ్యాంకుల జాతీయాకరణను రద్దు చేయాలనేదికూడా ఒకటి. వీటికి వ్యతిరేకంగా ప్రజలునిరసన, సమ్మెలు నిర్వహించారు.

ప్రపంచ ఆర్థికమాంద్యం మన దేశంలోనూ తలెత్తకుండా బలంగా ఉన్న ప్రభుత్వరంగం, బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలు ఎంతగానో ఉపయోగపడేవి. నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు దేశీయ, విదేశీ కార్పొరేట్లకు ఉపయోగపడుతున్నాయి. పర్యవసానంగా దేశీయ పరిశ్రమలు, వాణిజ్యం, ఆర్థిక స్వతంత్రతను నాశనంచేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మార్కెట్‌శక్తులు ప్రజల భవితవ్యాన్ని నిర్ణయించేదశలో దేశ పరిస్థితి నడుస్తోంది. దేశవ్యతిరేక విధానాలను కార్మికులు, రైతులు, ఇతర గ్రూపుల ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ బ్యాంకింగ్ పరిశ్రమ ప్రజలు సానుకూలంగా ఉన్నాయని భావించడానికి అవకాశాలు కనిపిస్తున్నాయి. 2024లో బ్యాంకులు 1.47లక్షల కోట్లు లాభం సంపాదించాయి. 2019లో 0.82లక్షల కోట్లు నష్టపోయింది. 2019లో ప్రభుత్వ బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 12.3శాతానికి తగ్గాయి. ప్రభుత్వరంగ బ్యాంకులను, ఇతర సంస్థలను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు జరుగుతున్నాయి. బ్యాంకు యూనియన్లు జాతీయకరణ జరిగి 55 సంవత్సరాలైన సందర్భంగా ఉద్యోగులు అనేక సమావేశాలను నిర్వహించి ఆనాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు.

మానవాభివృద్ధి సూచికలో ఉన్నత విద్య ఎక్కడ?!

మల్లాది శ్రీనగేష్

పదవ తరగతి చదివే విద్యార్థుల్లో 2021-22 సంవత్సరంలో 20.2 శాతం మంది మధ్యలో బడి మేనేశారని, 190 మిలియన్ల మంది 10 వ తరగతి పరీక్షకు హాజరుకాగా వారిలో 160 మిలియన్ల మంది విద్యార్థులే ఉతీర్ణులయ్యారనీ, వారిలో కేవలం 30 వేల మిలియన్ల మంది విద్యార్థులు మాత్రమే 11వ తరగతిలో చేరుతున్నారనేది కాదనలేని వాస్తవం ! ప్రభుత్వ నివేదికలు సైతం ఇదే చెపుతున్నాయి. ఈ విధంగా ఎక్కువ శాతం మంది విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించకపోతే మానవాభివృద్ధి సూచికలో, దేశ ప్రగతిలో మన భాగస్వామ్యం ఎక్కడుంటుంది. చదువుకోవడమంటే అక్షరాస్యతతోనే సరిపోతుందా అంతకుమించి ముందుకు సాగాలంటే ఏమేమి అడ్డంకులు, వాటిని అధిగమించడానికి మనం వ్యక్తిగతంగా ఏమి చేస్తున్నాం, ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి వెరసి దేశంలో విద్య రూపం, దాని ఫలితాలు ఎలా వున్నాయనేది నిశితంగా పరిశీలించాలి. ఎందుకంటే విద్యాహక్కు చట్టం 2009 ద్వారా నిర్బంధ ఉచిత విద్యా నినాదాన్ని చట్టబద్ధంగా ముందుకు తెచ్చాం. తద్వారా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పాఠశాలల నమోదు పెరిగింది. తద్వారా నాణ్యమైన విద్యాప్రణాళికల్లో వివిధ అవసరాలు అనగా మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ నియామకం చట్టబద్ధంగా కల్పించాల్సిన వసతులు ఇవన్నీ ప్రభుత్వాలకు కొంత భారంగా మారినప్పటికీ బాధ్యతగా పనిచేసి విద్యాఫలాలకు దూరంగావున్న బడుగు. బలహీన వర్గాల పిల్లలకు ముఖ్యంగా అక్షరాస్యతంటే తెలియని కుటుంబాలలో బడివైపు చూడని బాలలకు, ఆర్థిక, సాంఘిక పరిస్థితుల వలన బడిమానేసిన పిల్లలను వారి వయసుకుతగ్గ తరగతిలోనే చేర్చుకొని విద్యార్థుల్లో వివక్షలేకుండా అందరికీ సమాన విద్య, సమ్మిళిత విద్య ప్రాతిపదికన విద్యా హక్కును 2010 సంవత్సరం నుంచి అమలుచేస్తున్నారు.

యూఎన్‌డీపీ గ్లోబల్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సూచిక 2021 ప్రకారం 2022-23లో నిర్వహించిన ఆర్థిక సర్వే ప్రకారం, దేశంలో పాఠశాల విద్య అభ్యసించే సగటు పాఠశాల విద్యా సంవత్సరాలు 6.7 సంవత్సరాలుగా లెక్కించారు. ఈ నమూనాను ప్రపంచంలో చైనా, బ్రెజిల్ వంటి దేశాలతో పోల్చుకుంటే సగటు పాఠశాల విద్య 7.6, 8.1 సంవత్సరాలుగా లెక్కించారు. అనగా దేశంలో సరాసరి పాఠశాల విద్య అనగా నిరంతర విద్య ఆరున్నర సంవత్సరాలుగా తేలింది. అంటే దేశంలో ప్రజలు నిరంతర పాఠశాల విద్య అభ్యసించిన 191 దేశాల జాబితాలో 132వ దేశంగా ఉండగా, చైనా 79 వ దేశంగా, బ్రెజిల్ 87వ దేశంగా నిర్దేశించింది. ఈ పరిస్థితులవల్ల పౌర ప్రగతి కుంటుపడి దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి అవసరమైన మానవ వనరులు కొరవడడం -తద్వారా ఆర్థిక పరిపుష్టికి సరిపడు చేయూత మందకొడిగా పరిణమిస్తుంది . ఈ సమస్య వలయాలను అధిగమించడానికి దేశ పౌరులు తన చదువు చక్రాన్ని ప్రాథమిక లేదా సెకండరీ స్థాయిలోనే ఆపకుండా ఉన్నత చదువుల వైపు దృష్టి సారించాలి.

సెకండరీ విద్య స్థాయిలో బడిమానేసిన విద్యార్థుల వివరాలు యూ డైస్ 2021-2022 ప్రకారం మన దేశంలో 12.6 శాతం, కానీ 2014 సంవత్సరంతో పోలిస్తే 20.2 కన్నా తక్కువే. కరోనా కూడా ఈ తగ్గుదలకు ఒక కారణంగా ఉంది. సెకండరీ పాఠశాలస్థాయిలో బడి మానేసిన విద్యార్థులశాతం ఒడిశా రాష్ట్రంలో అధికంగా 27.3 శాతం, మేఘాలయలో 21.7శాతం, అసోంలో 20.3 శాతం, బీహార్‌లో 20.5 శాతం ఆంధ్రప్రదేశ్‌లో 16.3 శాతం, తెలంగాణలో 13.7 శాతం, కర్నాటకలో14.7 శాతంగా నమోదైంది. అతి తక్కువగా తమిళనాడు 4.5శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 1. 5శాతం గా నమోదు అయింది. పూర్వ ప్రాథమిక విద్య మొదలుకొని సెకండరీ స్థాయి విద్య వరకు 100 శాతం విద్యార్థుల నమోదు సాధించడంద్వారా 2030 సంవత్సరంనాటికి అనుకున్న రీతిలో మౌలిక సదుపాయాల కల్పన, తరగతి స్వరూప స్వభావాలను పునరుద్ధరించడం, అభ్యసనలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండేలా ప్రోత్సహించడం వంటి ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులు 12వ తరగతి చేరేవరకు తగిన మార్గాలను అన్వేషించడం ద్వారా విద్యార్థులందరిలో ఉన్నత విద్యా ఫలాలు అందేలా ప్రణాళికల ప్రధాని భూమికగా నూతన విద్యా విధానం ఉండాలని నిపుణులు పేర్కొంటున్నారు. 2022 మేలో విడుదలైన నేషనల్ అచీవ్మెంట్ సర్వే నివేదిక 2021 ప్రకారం ప్రతి విద్యార్థి ప్రగతి జాతీయస్థాయిలో

ప్రతి సబ్జెక్టులో పై తరగతికి వెళ్తున్న కొద్దీ పిల్లల విద్యా సామర్థ్యాల శాతం ఎక్కువగా తగ్గినట్లు వెల్లడైంది. సరాసరి విద్యార్థి స్థాయి ప్రగతి నిర్దేశించిన సూచికలో మూడవ తరగతి గణితంలో సాధించిన ప్రగతి 306కాగా ఐదవ తరగతి గణితంలో 284 గా, ఎనిమిదో తరగతిలో 255 కాగా పదవ తరగతిలో 220 స్థాయికి ప్రగతి తగ్గినట్లు ఆ నివేదిక వెల్లడించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రగతి మరింత కుంటుపడినట్లు నాస్ నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో గిరిజన, వెనుకబడిన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పూర్తిస్థాయిలో పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 8వ తరగతిలో షెడ్యూల్డ్ తరగతికి చెందిన విద్యార్థులు గణితంలో సరాసరి 249 సాధించగా, షెడ్యూల్డ్ తెగకు చెందిన వారు 244, ఓబీసీకి చెందిన విద్యార్థులు 253 సాధించగా, జనరల్ కేటగిరీకి చెందిన విద్యార్థులు సరాసరి అధికంగా 260 మార్కులు సాధించినట్లు నివేదిక తెలియపరచింది.

ఈ పరిస్థితుల నుంచి పిల్లలను తీర్చిదిద్దడానికి విద్యార్థుల్లో తరగతి వారీ విద్యాసామర్థ్యాల సాధనకోసం పూర్వ ప్రాథమిక విద్యకు నోచుకోక పాఠశాలలో 1వ తరగతిలో చేరుతున్న దళిత, గిరిజన, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తగిన మార్గాలను అన్వేషించి ప్రతి విద్యార్థి తరగతి వారీ సామర్థ్యాలను ప్రాథమికస్థాయి నుంచి సాధించేలా ప్రణాళికలు అమలుచేయాలి. ఉన్నత విద్య విషయానికొస్తే, 6వ తరగతిలో ప్రవేశించి అభ్యసనా లేమితో ఇబ్బందులకు గురౌతున్న విద్యార్థులకు తరగతి స్థాయి విద్యా సామర్థ్యాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాలు సుదీర్ఘంగా నిర్వహించాలి.దీనికి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వీటిని దీర్ఘస్థాయిలో నిర్వహించి ప్రోత్సహించాలి. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖలు సమగ్ర శిక్షణ ద్వారా సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్), ఆస్కి వారి సెంటర్ ఫర్ ఇన్నోవేషన్స్ అండ్ పబ్లిక్ సిస్టం, యూనిసెఫ్, సాంకేతిక సహకారంతో చేపట్టిన లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమం 6-9 తరగతులకు నిర్వహించి తక్కువ వ్యవధిలోనే మంచి ఫలితాలు సాధించడం, ఆంధ్రప్రదేశ్ 10 జిల్లాల్లో చేసిన పైలట్ అనంతరం రాష్ట్రమంతా ఎల్.ఐ పి కార్యక్రమాన్ని అనుసరించేలా ప్రణాళికలు చేయడం మంచి పరిణామం. ఈ కార్యక్రమం సిలబస్ విద్యను పరిగణనలోనికి తీసుకొని అకడమిక్ క్యాలండరుకు భంగం కలగకుండా పాఠశాల రోజువారీ విద్యా ప్రణాళికతోనే సమ్మిళితం చేయడం ఒక ప్రత్యేకమని చెప్పకతప్పదు. ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు, పాఠశాల యాజమాన్యాలు, తలిదండ్రులు కలిసికట్టుగా పనిచేయడమే ఉన్నత విద్యా రంగంలో ఎదురౌతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు సిద్ధిస్తాయి.

జమ్మూ కశ్మీరు ఎన్నికలు ఎప్పుడు?

కేంద్రానికి ఖడ్గే సూటిప్రశ్న

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే విమర్శలు గుప్పించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు ప్రకారం జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా అక్కడి ప్రజలు తమ నాయకులను ఎన్నుకుంటా రని తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసి... ఐదేళ్లు పూర్తైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆర్టికల్ 370 రద్దుతో ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుం దని, తీవ్రవాదాన్ని అరికట్టే అవకాశం ఉంటుందని గతంలో మోదీ చెప్పారు. అయితే... ప్రస్తుతం ఆయన మాటలకు భిన్నంగా జమ్ములో ఉగ్రదాడులు రోజురోజుకూ పెరిగిపోతు న్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు 683 ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. 258 మంది జవాన్లు, 170 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు' అని ఖర్గే పేర్కొన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి జమ్ములో 25 ఉగ్రదాడులు జరిగాయని, 15 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, 27 మంది గాయపడ్డారని తెలిపారు.

పాకిస్థాన్ అనుకూల నినాదాలు

మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసుల నిర్ధారణ

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఒక్కసారిగా తీవ్ర కలకలం రేగింది. రోహిని ఏరియాలో ఓ వ్యక్తి ఇంట్లో పాకి స్థాన్ అనుకూల నినాదాలు కనిపించాయి. అతడి ఇంటి గోడపై 'పాకిస్థాన్ లాంగ్ లైవ్' అని రాసి ఉంది. దానిని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమా చారం అందజేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఇంటిని పరిశీలిం చారు. అవంతిక సీ బ్లాక్ ప్రాంతంలో ఓ ఇంటిలో పాకి స్థాన్‌కు అనుకూలంగా నినాదాలు రాసి ఉన్నాయి. ఆ ఇంట్లో ఒక్కరే ఉంటున్నారని ప్రాథమిక సమా చారం. అతడి మానసిక పరిస్థితి సరిగా లేదని నిర్ధారించుకున్నాం. అయినప్పటికీ పాకిస్థాన్, లేదంటే ఉగ్రవాద సంస్థలతో అతడికి సంబంధం ఉందా అనే విషయంపై ఆరా తీస్తున్నాం. ఆ క్రమంలో ఆ వ్యక్తి బంధువులను సంప్రదించాం. ఆ ఇంట్లో ఉన్న బ్యానర్, పోస్టర్‌ను సీజ్ చేశాం అని' పోలీసు ఉన్నతాధికారి ఒకరు మీడియాకు వివరించారు. ఆ వ్యక్తి ఇంట్లోకి పోలీసులు వెళ్లే సమయంలో కొందరు స్థానికులు కూడా వెళ్లారు. ఇంటి గోడపై పాకిస్థాన్‌కు అనుకూలంగా రాసిన స్లోగన్ కనిపించింది. తర్వాత మరో గదిలోకి వెళ్లగా చీకటి ఉంది. గది మధ్యలో మద్యం బాటిల్ పట్టుకున్న ఓ వ్యక్తిని గుర్తించారు. ఇలా ఎందుకు చేస్తున్నావు అని అడగగా నాకు పాకిస్థాన్ అంటే ఇష్టం అని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చారు. మరోసారి ఇలా చేయొద్దని అతడికి చెప్పి వచ్చేశారు.

కేంద్రంపై ముప్పేట దాడి

- వక్ఫ్ చట్ట సవరణను అంగీకరించం
- ప్రతిపక్ష నేతల స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సమాజంలో విభజనను సృష్టించేందుకు వక్ఫ్ చట్టాన్ని సవరించే బిల్లును బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తోందని, అలాంటి చట్టాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని అనేక మంది ప్రతిపక్ష నాయకులు సోమవారం స్పష్టం చేశారు. అయితే అనేక మంది బీజేపీ నాయకులు మాత్రం ఆ చర్యను గట్టిగా సమర్థించారు. మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలో పారదర్శకతను తీసుకురావాలనే ఉద్దేశంతో ఎల్లప్పుడూ పని చేస్తుందని చెప్పుకొచ్చారు. వక్ఫ్ చట్టం-1995 సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించినట్లయితే, వక్ఫ్ బోర్డులు తమ ఆస్తుల వాస్తవ విలువను నిర్ధారించడానికి జిల్లా కలెక్టర్‌ల వద్ద నమోదు చేయడాన్ని తప్పనిసరి చేస్తుంది. దేశంలో 30 వక్ఫ్ బోర్డులు ఉన్నాయి. అన్ని వక్ఫ్ ఆస్తుల ద్వారా సంవత్సరానికి రూ.200 కోట్ల ఆదాయం సమకూరుతుందని ఆదివారం వర్గాలు పేర్కొన్నాయి. వక్ఫ్ బోర్డుల పని తీరులో మరింత జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా 1995 నాటి చట్టానికి సవరణలు చేసేందుకు ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును తీసుకురావడానికి సిద్ధంగా ఉందని, ఈ సంస్థల్లో మహిళలను తప్పనిసరిగా చేర్చాలని ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. ముస్లిం సమాజంలోని డిమాండ్ల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నాయి. విలేకరులు ప్రతిపాదిత సవరణ గురించి అడిగినప్పుడు సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ 1995 నాటి వక్ఫ్ బోర్డుల చట్టాన్ని సవరించేందుకు పార్లమెంటులో బిల్లు తీసుకురావాలన్న కేంద్రం ప్రయత్నాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందని, ముస్లింల హక్కులను బీజేపీ లాక్కోవడానికి ప్రయత్ని స్తోందని విమర్శించారు. లక్నోలో తమ పార్టీ దివంగత ఎంపీ, నాయకుడు జనేశ్వర్ మిశ్రా జయంతుత్సవంగా సందర్భంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ హిందువులు, ముస్లింలను విభజించడం, ముస్లిం సోదరుల హక్కులను హరించడం, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే బీజేపీ పని అని ధ్వజమెత్తారు. ఐయూఎంఎల్‌కు చెందిన ఇటీ మహమ్మద్ బషీర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ చర్య దురుద్దేశంతో కూడుకు న్నదని అన్నారు. పార్లమెంటు వెలుపల విలేకరులతో ఆయన మాట్లాడుతూ 'కె రెహమాన్ ఖాన్ అధ్వర్యంలో ఒక కమిటీని నియమించారు. వక్ఫ్ ఆస్తులపై బీజేపీ పట్టు ఉండాలని, ఆస్తులను తమ అధీనంలోకి తీసుకోవాలని కోరుకుంది. అలాంటి చట్టం వస్తే దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తాం. భావసారూప్యత కలిగిన పార్టీలతో కూడా మాట్లాడతాం' అని అన్నారు. ప్రభుత్వం బిల్లుతో ముందుకు వెళితే, బలమైన వ్యతిరేకతకు సిద్ధంగా ఉండాలి' అని బషీర్ తెలిపారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం బడ్జెట్‌పై చర్చ నుంచి పారిపోవాలనుకుంటోందని, అందుకే వక్ఫ్ అంశాన్ని తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ఇది పార్లమెంటులో ప్రవేశపెట్టే వరకు, నేను వ్యాఖ్యానించడానికి ఇష్టపడను' అని ఆమె తెలిపారు. బీజేపీ విభజన రాజకీయాలను నమ్ముతోందని, వక్ఫ్ బోర్డులను బలోపేతం చేయడానికి బదులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం ఎంపీ అమర్ రాం అన్నారు. మైనారిటీలకు విద్య, ఉపాధి కల్పించే బదులు వారి హక్కులపై ఎప్పటి నుంచో దాడి చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామని, ఈ విభజన వాక్చాతుర్యాన్ని కొనసాగిస్తే 2024లో ట్రైలర్ చూపించామని, ఇప్పుడు పూర్తి సినిమా వారికి చూపిస్తామని తెలిపారు. సీపీఎం మరో ఎంపీ సుదామ ప్రసాద్ మాట్లాడుతూ విభజన అజెండాను ప్రోత్సహించడమే బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 'నిరుద్యోగాన్ని ఎదుర్కోవటానికి బిల్లు తీసుకురారు. కానీ వారు మందిరం-మసీదు, హిందూస్థాన్-పాకిస్తాన్ వంటి విభజన అజెండాను మాత్రమే వారంలో 24 గంటలూ చూస్తున్నారు' అని ఆయన అన్నారు. వక్ఫ్ చట్టంపై బిల్లుపై చర్చ గురించి అడిగిన ప్రశ్నకు జేఎంఎం ఎంపీ మహువా మజీ మాట్లాడుతూ ఏకపక్ష అభిప్రాయం తీసుకో వద్దని, ఏవైనా సవరణలు చేయాలనుకుంటే, ప్రభుత్వం అన్ని వైపులా వినాలని అన్నారు. వక్ఫ్ చట్టంలోని లోపాలను తొలగిస్తే బాగుంటుందని బీజేపీ ఎంపీ త్రివేంద్ర సింగ్ రావత్ పార్లమెంటు వెలుపల విలేకరులతో అన్నారు. బీజేపీఎం ఎంపీ సంజయ్ జైస్వాల్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం పారదర్శకతతో నడుస్తుందని, కుంభకోణాలు చేసే వారు మాత్రమే పారదర్శకతకు అభ్యంతరం చెప్పగలరని అన్నారు. ఫైజాబాద్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అవదేశ్ ప్రసాద్ మాట్లాడుతూ బిల్లును ఏ ఉద్దేశంతో తీసుకువస్తున్నారు, దానిలోని అంశాలు ఏమిటో పార్టీ విశ్లేషిస్తుంది, తదనుగుణంగా దానిపై వ్యాఖ్యానిస్తుందని తెలిపారు. సమాజ్‌వాది ఎంపీ జియా ఉర్ రెహమాన్ బార్క్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం బిల్లును తీసుకొచ్చినప్పుడల్లా అది సమాజ ప్రయోజనాల కోసమేనని కారణాన్ని చెప్పుకొస్తుందన్నారు. 'నేను వారిని అడగాలనుకుంటున్నాను. వ్యవసాయ బిల్లులు రైతుల ప్రయోజనాల కోసం ఉన్నాయా? వారి ఉద్దేశం స్పష్టంగా ఉంటే, వారు సమాజంలోని మేధావులతో మాట్లాడి ఉండాల్సింది. కానీ వారి ఉద్దేశాలు సరైనవి కావు. వారు వక్ఫ్ బోర్డులను నియంత్రించాలనుకుంటున్నారు. ముస్లిం సమాజాన్ని అణచివేయాలనుకుంటున్నారు' అని ఆయన అన్నారు. కాగా, వక్ఫ్ బోర్డు స్వయంప్రతిపత్తిని ఎన్‌డీఏ ప్రభుత్వం తొలగించాలని చూస్తోందని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం ఆరోపించారు. వక్ఫ్ బోర్డులు, వక్ఫ్ ఆస్తులకు బీజేపీ మొదటి నుంచి వ్యతిరేక మని, వక్ఫ్ ఆస్తులు, వక్ఫ్ బోర్డులను హిందూత్వ అజెండా ప్రకారం పూర్తి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. వక్ఫ్ బోర్డుల చట్టపరమైన హోదా, అధికారాలపై ఎలాంటి జోక్యాన్ని సహించబోమని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఆదివారం తెలిపింది. ప్రతిపక్ష పార్టీలు ఇటువంటి చర్యను పూర్తిగా తిరస్కరించాలని, పార్లమెంటులో అటువంటి సవరణ బిల్లు ఆమోదం పొందకుండా చూడాలని కోరింది. ఏఐఎంపీఎల్‌బీ అధికార ప్రతినిధి ఎస్‌క్యూఆర్ ఇల్యాయిస్ మాట్లాడుతూ ఈ 'ప్రభుత్వ దురుద్దేశపూరిత చర్య' కు వ్యతిరేకంగా ముస్లింలందరూ, వారి మతపరమైన, మిల్లీ సంస్థలను ఐక్యం కావాలని బోర్డు విజ్ఞప్తి చేసింది. ఈ చర్యను అడ్డుకోవడానికి బోర్డు అన్ని రకాల చట్టపరమైన, ప్రజాస్వామ్య చర్యలను తీసుకుంటుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పార్టీలో దిద్దుబాటు చర్యలకు సీఎం మమత శ్రీకారం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతలు గల్లీ స్థాయి నుంచి సీఎం వరకు నిత్యం వివాదాల్లో చిక్కుకుంటూ ఉంటారు. దీంతో కేంద్రంలోని అధికార పార్టీతో నిత్యం చురకలంటించుకోక తప్పని పరిస్థితి. ఈ నేపథ్యంలో అధినేత్రి మమతా బెనర్జీ... దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారా అంటే తాజా పరిణామాలను బట్టి అవుననే చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. తేజ్‌పూర్ బీచ్ సమీపంలోని అటవీశాఖ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను ఫారెస్ట్ రేంజర్ మనీషా సాహు తొలగించారు. ఫారెస్ట్ రేంజర్‌పై జైళ్ల శాఖ మంత్రి అఖిల్ గిరి స్థానికుల సమక్షంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హెచ్చరించారు. అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ప్రతిపక్షాలు విమర్శలు ప్రారంభించాయి. అఖిల్ గిర్‌పై చర్యలు తీసుకోకుండా పార్టీ పరువు పోతుందంటూ సొంత పార్టీలోనే అసమ్మతి రేగింది. తృణమూల్ కాంగ్రెస్ స్పందించింది. మంత్రి పదవికి రాజీనామా చేసి, అటవీ శాఖ అధికారి మనీషా సాహును క్షమాపణ కోరాలని అఖిల్ గిరిని ఆదేశించాయి. తొలుత బెట్టు చేసిన... ఆ తర్వాత దిగి వచ్చి రాజీనామా చేసేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే మహిళా అధికారికి క్షమాపణలు మాత్రం చెప్పనని అఖిల్ గిరి కుండ బద్దలు కొట్టారు. తన రాజీనామా లేఖను తొలుత ఈ మెయిల్ ద్వారా పంపుతానని స్పష్టం చేశారు. అనంత రం సీఎం మమతాను కలిసి స్వయంగా తన రాజీనామా లేఖను సమర్పిస్తానని పేర్కొన్నారు. గతంలో ఇదే అఖిల్ గిరి... రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కీలక వ్యాఖ్యలు చేశారు. అప్పుడూ వివాదం రేగింది. బెంగాల్‌లోని రామ్‌నగర్‌కు ఎమ్మెల్యేగా అఖిల్ గిరి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

డిజిటల్ మీడియా గొంతు నొక్కే కుట్ర

కేంద్రంపై ప్రియాంక గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ: ప్రసార సేవల (నియంత్రణ) బిల్లును తీసుకురావడం ద్వారా డిజిటల్ మీడియా, సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు, ప్రైవేట్ హోదాలో రాసే, మాట్లాడే వారి గొంతు నొక్కే కుట్రకు మోదీ ప్రభుత్వం సిద్ధమవుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం విమర్శించారు. అటువంటి చర్యలను దేశం సహించబోదని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి... సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో మహాత్మా గాంధీ (యంగ్ ఇండియా, 1922), జవహర్‌లాల్ నెహ్రూ (మార్చి, 1940) కు చెందిన రెండు మాటలను పంచుకున్నారు. అందులో వారు వాక్, పత్రికా స్వేచ్ఛ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 'మన పౌరులకు వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ లేదని ఈ రెండు ఉదాహరణలు చూపిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజలు దాని కోసం సంవత్సరాలుగా పోరాడారు' అని ఆమె ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛ మన అమరవీరులు, స్వాతంత్ర్య సమరయోధుల గొప్ప వారసత్వం అని ఆమె అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో పౌరుల స్వేచ్ఛను హరించడాన్ని ఏ ప్రభుత్వమూ ఆలోచించలేదని ప్రియాంక గాంధీ అన్నారు. 'ఈరోజు అధికారాన్ని ఉపయోగించుకుని మొత్తం మీడియానే ప్రభుత్వ బాకాగా మార్చారు. మరోవైపు ప్రసార బిల్లును తీసుకురావడం ద్వారా డిజిటల్ మీడియా, సోషల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లతో పాటు ప్రైవేట్ హోదాలో రాసే వారి, మాట్లాడే వారి గొంతు కూడా నొక్కేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది' అని అన్నారు. 'ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. దేశం ఇలాంటి చర్యలను సహించదు' అని ఆమె నొక్కి చెప్పారు. ప్రసార సేవల (నియంత్రణ) బిల్లు వాక్ స్వాతంత్ర్యం, స్వతంత్ర మీడియాకు ప్రత్యక్ష ముప్పు అని కాంగ్రెస్ శుక్రవారం ఆరోపించింది. ఇది ఆన్‌లైన్‌లో 'అధిక నిఘా' కు మార్గం సుగమం చేస్తుందని పేర్కొంది. కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా 'ప్రభుత్వ నిరంకుశత్వం' అని పేర్కొన్న దానికి వ్యతిరేకంగా ప్రజలు తమ స్వరం పెంచాలని కోరారు.

ప్రజల సమ్మతితోనే నిర్ణయం

ఆర్టికల్ 370పై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ 'నిర్ణయాన్ని అమలు చేయడానికి జమ్మూకశ్మీర్‌లోని ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవడం కచ్చితంగా అవసరమని నా మనస్సులో పూర్తి స్పష్టత ఉంది' అని తెలిపారు. ప్రధాన మంత్రి వ్యాఖ్యలు '370 : అన్‌డూయింగ్ ది అన్‌జస్ట్, ఎ న్యూ ఫ్యూచర్ ఫర్ జమ్మూకశ్మీర్' అనే కొత్త పుస్తకం ముందుమాటలో వచ్చాయి. 'నిర్ణయం ఎప్పుడు తీసుకున్నా, విధించడం కంటే ప్రజల సమ్మతితో జరగాలని మేము కోరుకున్నాం' అని ఆయన పుస్తకంలో రాశారు. ఈ పుస్తకం లాభాపేక్షలేని సంస్థ బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ పరిశోధించి, రాయబడింది. పెంగ్విన్ ఎంటర్‌ప్రైజ్ ముద్రణ క్రింద ప్రచురించబడింది. మోదీ తాను అనుకున్న లక్ష్యాన్ని ఎలా సాధించగలిగారో పుస్తకంలో వివరంగా పేర్కొన్నారు. ఈ నెలలో విడుదల కానున్న పుస్తకం, 'వత్తాంతాలు, భారతదేశ చరిత్రలో గొప్ప రాజ్యాంగ విన్యాసం, ప్రధాని మోదీ అసాధ్యమని అనిపించిన వాటిని ఎలా నిర్వహించారనే దాని అంతర్గత కథను చెబుతుంది' అని ప్రచురణకర్తలు తెలిపారు. ఇది 'ఆర్టికల్ 370కు చెందిన అన్యాయమైన నియమావళికి దారితీసిన స్వాతంత్ర్యం సమయంలో అనేక తప్పిదాలను పరిశీలిస్తుంది. అలాగే 1949లో ప్రారంభమైనప్పటి నుంచి ఆర్టికల్ 370కు చెందిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలను చర్చిస్తుంది' అని ఆర్టికల్ 370 రద్దుకు ఐదేళ్లు సందర్భంగా పెంగ్విన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ పుస్తకం ఆర్టికల్ 370 రద్దుకు దారితీసిన సంఘటనలతో పాటు పురాతన కాలం నుంచి సమకాలీన కాలం వరకు ప్రాంత చరిత్రను కూడా వివరిస్తుందని తెలిపారు. 'ప్రధాని నరేంద్ర మోదీతో సహా అగ్ర నిర్ణయాధికారులతో పరస్పర చర్యల ద్వారా వాస్తవ నిర్ణయం తీసుకునే ప్రక్రియ దాక్యుమెంట్ చేయబడిన మోదీ ప్రభుత్వంపై ఇదే మొదటి పుస్తకం' అని ప్రచురణకర్తలు పేర్కొన్నారు.

భూకబ్జాల వల్లే వయనాడ్ విషాదం

కేంద్ర మంత్రి వితండవాదం

న్యూఢిల్లీ: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి జరిగిన భారీ ఉత్పాతం, ప్రాణనష్టంపై విమర్శలు, ప్రతివిమర్శలు కొనసాగుతున్నాయి. ముందస్తు హెచ్చరికలను కేరళ సర్కార్ పట్టించుకోలేదని కేంద్రమంత్రి అమిత్‌షా ఇటీవల పార్లమెంటులో చేసిన ప్రకటనను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. తాజాగా కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ సోమవారం స్పందించారు. వయనాడ్‌లో అక్రమ గనుల తవ్వకాలు, జనావాసాల వల్లే అపార ప్రాణనష్టం జరిగిందని తెలిపారు. అక్రమ జనావాసాలకు స్థానిక రాజకీయవేత్తల రక్షణ ఉందని, టూరిజం పేరుతో సరైన జోన్లు కూడా ఏర్పాటు చేయలేదని, ఈ ప్రాంతంలో భూకబ్జాలు జరిగాయని కేంద్రమంత్రి ఆరోపించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 'హైలీ సెన్సిటివ్ ఏరియా' అని తెలిపారు. అటవీ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ సారథ్యంలో తాము ఇప్పటికే కమిటీ వేశామని, స్థానిక ప్రభుత్వ యంత్రాంగం పరిరక్షణలో అక్కడి అక్రమ జనావాసాలున్నాయని, అక్రమ గనుల తవ్వకాలు జరుగుతున్నాయని భూపేందర్ యాదవ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. కాగా, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా వివిధ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్‌ను బీజేపీ తోసిపుచ్చింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశమే లేదని బీజేపీ తెలిపింది. దీనిపై యూపీఏ ప్రభుత్వ హయాం నుంచి విధానపరమైన నిర్ణయంలో ఎలాంటి మార్పు జరగలేదని తెలిపింది. ప్రకృతి వైపరీత్యాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించే నిబంధనల ఏదీ లేదని 2013 ఆగస్టు 6న అప్పటి హోంమంత్రి ముల్లపల్లి రామచంద్రన్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పిన విషయాన్ని బీజేపీ సీనియర్ నేత వి.మురళీధరన్ ఫేస్‌బుక్ పేజ్‌లో పోస్ట్ చేశారు.

దేశీయ విమానాల్లోనూ బిజినెస్ క్లాస్: ఇండిగో

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకుంది. 12 ఎంపిక చేసిన దేశీయ మార్గాల్లో బిజినెస్ క్లాస్ సీట్లు ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. నవంబరు మధ్య నుంచి ఇవి అందుబాటులోకి వస్తాయని తెలిపింది. సంస్థ కార్యకలాపాలు ప్రారంభమై 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ విషయాలు వెల్లడించింది. కొత్తగా ప్రవేశపెట్టనున్న బిజినెస్ క్లాస్ టికెట్లు మంగళవారం నుంచే బుకింగ్‌కు అందుబాటులోకి వస్తాయని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా మాత్రమే దేశీయ మార్గాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను ప్రతిపాదించాయి. 'ఇండిగో బ్లూచిప్' పేరిట కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్‌ను తీసుకొస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మరో ఏడు అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు ఇండిగో తెలిపింది. ప్రస్తుతం ఈ సంస్థ రోజూ 2,000 విమాన సర్వీసులను 120 గమ్యస్థానాలకు నడుపుతోంది. వీటిలో 33 విదేశీ నగరాలున్నాయి. దేశీయ విమానయాన సర్వీసులలో ఇండిగో మార్కెట్ వాటా 61 శాతం. జూన్ చివరి నాటికి ఈ కంపెనీ వద్ద 382 విమానాలున్నాయి. వీటిలో 18 లీజుపై తీసుకున్నారు.

ఆర్టికల్ 370 రద్దుకు ఐదేళ్లు

బీజేపీ ర్యాలీ... ప్రతిపక్షాల ఆందోళన

శ్రీనగర్: మోదీ ప్రభుత్వం 'ఆర్టికల్ 370'ని రద్దు చేసి సోమవారానికి ఐదేళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ ఆర్‌ఎస్ పురాలోని బానా సింగ్ స్టేడియంలో ఉత్సాహంగా బీజేపీ ఏకాత్మ మహోత్సవ ర్యాలీ నిర్వహించింది. దీంతో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. 370 రద్దు చేసిన ఈ ఐదేళ్లలో ఏం సాధించారని బీజేపీని జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రవీంద్ర శర్మ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీజేపీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టికల్ రద్దు చేసి... నేడు వేడుకలు జరపడం సిగ్గు చేటంటూ బీజేపీకి చురకలంటించారు. ఆర్టికల్ 370 రద్దుకు నిరసనగా మహారాజా హరిసింగ్ పార్క్ వద్ద డెమొక్రటిక్ ప్రోగ్రెసీవ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) ఆందోళన నిర్వహించింది. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో అధికార బీజేపీ వేడుకలకు సిద్ధం కావడంతో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. కాగా, 2019, ఆగస్టు ఐదో తేదీన ఆర్టికల్ 370ని మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. మరోవైపు ఇదే రోజును ప్రతిపక్షాలు బ్లాక్ డేగా అభివర్ణించాయి.

అమర్నాథ్ యాత్ర నిలిపివేత

సంక్లిష్ట పరిస్థితుల్లో అమర్నాథ్ యాత్రకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం విరామం ప్రకటించింది. అమర్నాథ్ యాత్రికులు భగవత్ క్యాంప్‌లో ఉండిపోయారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టింది. మరోవైపు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహకాలు చేస్తుంది. ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 10 వరకు మూడు కేంద్ర ఎన్నికల సంఘం ఆ రాష్ట్రంలో పర్యటించనుంది.

విద్యుదాఘాతంతో 9 మంది కావడి యాత్రికుల మృతి

ఇద్దరికి గాయాలు... బీహార్‌లో ఘటన

హాజీపూర్: బీహార్‌లోని వైశాలి జిల్లాలో కావడి యాత్రలో ఘోర ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి హాజీపూర్ సమీపంలోని సుల్తాన్‌పూర్ వద్ద కావడి యాత్రికులు ప్రయాణిస్తున్న డీజే వాహనానికి హైటెన్షన్ వైర్ తగిలడంతో తొమ్మిది మంది మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుల్లో ఒక మైనర్ ఉన్నట్లు ఉన్నతాధికారి ఒకరు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి 11.15 గంటల ప్రాంతంలో ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు ఎవరైనా తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో వారి వాహనం పై భాగం హైటెన్షన్ ఓవర్ హెడ్ వైర్‌ను తాకడంతో తొమ్మిది మంది యాత్రికులు (కన్వారి యాలు) మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వారు జలాభిషేకం చేయడానికి సోనేపూర్‌లోని బాబా హరిహరనాథ్ ఆలయానికి వెళు తున్నారు' అని వైశాలి జిల్లా మేజిస్ట్రేట్ యశ్‌పాల్ మీనా పీటీఐకి తెలిపారు. 'ప్రాథమిక విచారణలో బాధితులు కన్వారియాల కోసం నిర్దేశించిన ప్రత్యేక మార్గాన్ని తీసుకోలేదు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వారిద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంపించాం' అని వివరించారు. వైశాలి, పరిసర ప్రాంతాలకు చెందిన మృతుల గుర్తింపును జిల్లా యంత్రాంగం నిర్ధారించిందని, మృతుల బంధువులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామని డీఎం తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారని హాజీపూర్-సదర్ సబ్ డివిజనల్ అధికారి రాంబాబు బైతా గతంలో ప్రకటించారు. కన్వరియాలు ట్రాలీలో డీజేని తీసుకువెళు తున్నారని, దానికి 11 వేల వోల్టుల విద్యుత్ తీగ తగిలిందని స్థానిక ఎస్డీపీవో ఓంప్రకాశ్ తెలిపారు. దీంతో వారు విద్యుదాఘాతానికి గురయ్యారని చెప్పారు. ఘటనా స్థలంలోనే ఎనిమిది మంది మరణించారని, మరొకరు ఆస్పత్రిలో చనిపోయారని వెల్లడించారు.

ఉదయనిధికి ఇంకా సమయం రాలేదు: స్టాలిన్

చెన్నై: తన కుమారుడు ఉదయనిధి ఉపముఖ్య మంత్రి అయ్యేందుకు ఇంకా సమయం రాలేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. ఉదయనిధి ఉపముఖ్య మంత్రి అంటూ వస్తున్న వార్తలను స్టాలిన్ కొట్టిపారేశారు. 'ఉదయనిధిని డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ పార్టీలో పెరుగుతోంది. కానీ, మరీ పూర్తి స్థాయిలో లేదు' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఉదయనిధి ప్రస్తుతం తన తండ్రి కేబినెట్‌లో క్రీడా, యువజన సంక్షేమ శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

రూ.15 లక్షల కోట్లు ఆవిరి

ప్రపంచ మార్కెట్ల దెబ్బకు సూచీలు ఢమాల్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఆరంభంలోనే 2,400 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్‌ను ఆరంభించిన సెన్సెక్స్... ఇంట్రాడేలో 2600 పాయింట్ల వరకు నష్టాల్లోకి జారుకుంది. 24,300 దిగువన ఖాతా తెరిచిన నిఫ్టీ... ఓ దశలో 24 వేల స్థాయిని కోల్పోయింది. చివరిలో కొంతమేరకు కోలుకొని 24 వేల ఎగువన ముగిసింది. దలాల్ స్ట్రీట్‌లో ఒక్కసారిగా ఏర్పడిన కుదుపు కారణంగా రూ.15 లక్షల కోట్లు ఆవిరైంది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.457 లక్షల కోట్ల నుంచి రూ.442 లక్షల కోట్లకు పడిపోయింది. సెన్సెక్స్ ఉదయం 78,588.19 పాయింట్ల వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 78,295 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ... చివరికి 2,222.55 పాయింట్ల నష్టంతో 78,759.40 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 662 పాయింట్ల నష్టంతో 24,055 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌యూఎల్, నెస్లే ఇండియా షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగాయి. టాటా మోటార్స్ (7.32 శాతం), అదానీ పోర్ట్స్ (5.93 శాతం), టాటా స్టీల్ (5.31 శాతం), ఎస్‌బీఐ (4.34 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (4.19 శాతం) నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.35 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా... బంగారం ఔన్సు 2,465 డాలర్ల స్థాయిలో కొనసాగుతోంది.

అమెరికాలో మాంద్యం భయాలు: అమెరికాలో జులై నెలలో ఉద్యోగాల కల్పన అంచనాల కంటే నెమ్మదించింది. దీంతో మాంద్యం ముంచుకొస్తుందనే ఊహాగానాలు బలపడ్డాయి. వ్యవసాయేతర రంగాల్లో జులై నెలలో 1.14 లక్షల ఉద్యోగాలు మాత్రమే నమోదైనట్లు అక్కడి లేబర్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. వాస్తవానికి ఇది 1.75 లక్షల వరకు ఉండొచ్చని ముందుగా అంచనా వేశారు. జనాభా వృద్ధికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ఈ సంఖ్య 2 లక్షల వరకు ఉండాలని గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆ సంఖ్య చాలా దిగువన ఉండటంతో మాంద్యం రావొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు అక్కడ నిరుద్యోగిత రేటు 4.3 శాతానికి చేరుకుంది.

మరోవైపు, బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇటీవల వడ్డీరేట్లను 0.25 శాతం పెంచింది. బాండ్ల కొనుగోళ్లు తగ్గించింది. ఫలితంగా అక్కడి కరెన్సీ యెన్ బలపడింది. దీంతో నష్టాలు నివారించడం కోసం మదుపర్లు తమ వాటాలు విక్రయించడం ప్రారంభించారు. ఫలితంగా అమెరికా టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీని ప్రభావం ఆసియా సహా మొత్తం ప్రపంచ మార్కెట్లపై కనిపించింది. జపాన్ నికాయ్ సూచీ సోమవారం ఓ దశలో 14 శాతానికి పైగా కుంగింది. ఇతర ప్రపంచ మార్కెట్లూ అదే బాటలో కొనసాగాయి. కాగా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఘర్షణపూరిత వాతావరణం ఎప్పుడు భగ్గుమంటుందోనని మార్కెట్లు ఆందోళన చెందుతున్నాయి.

గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతం

- ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-నరసరావుపేట: సీపీఐని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇందుకోసం జిల్లా, మండల, గ్రామ స్థాయిలో శాఖలను ఏర్పాటు చేసి, నెలవారి సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.నరసరావుపేటలోని షాదీఖానాలో సోమవారం జరిగిన సీపీఐ పల్నాడు జిల్లా కార్యకర్తల సమావేశానికి జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ శత వసంతాల వేడుకలకు సిద్ధమవుతున్న వేళ.. దేశ రాజకీయ పరిస్థితులను సమీక్షించి ప్రజల పార్టీగా సీపీఐని బలోపేతం చేసేందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు నిర్ణయించాయని చెప్పారు. గత ఎన్నికలకు ముందు బీజేపీ 400 సీట్లు గెలుస్తామంటూ ప్రకటించిందని... కానీ సీపీఐ, ఇండియా కూటమి చేసిన పోరాటాలతో బీజేపీ 240 స్థానాలకే పరిమితమైందని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం టీడీపీ, జేడీయూ పార్టీల అండతో కొనసాగుతోందన్నారు. నరేంద్ర మోదీ గత పదేళ్ల పాలన... అవినీతి, అక్రమాలు, ప్రజాధనాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడం, ప్రైవేటీకరణ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడంతోనే గడిచిందని అన్నారు. రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం తీరని నష్టం చేసిందని రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాలకు నిధులు ఇవ్వకుండా అడ్డుకుందని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మకానికి పెట్టి కార్మికులను రోడ్డెక్కించిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రాజధాని అమరావతి రైతులకు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కార్మికులకు సీపీఐ అండగా నిలిచి పోరాటాలు చేసిందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు, దళితులపై దాడులకు వ్యతిరేకంగా సీపీఐ చేసిన పోరాటాలను ముప్పాళ్ల గుర్తుచేశారు. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని ప్రభుత్వం అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ నిలిపివేతకు, రాష్ట్ర విభజన హామీల అమలుకు కృషి చేయాలని సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలపై పెద్దఎత్తున పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐదేనన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో భూపోరాటాలు చేశామని, దున్నేవాడికే భూమి అన్న నినాదం సీపీఐదేనన్నారు. రాష్ట్రంలో భూసంస్కరణల చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, ఏరియా కమిటీ కార్యదర్శులు మందపాటి రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్వాతి, నిర్మల, సుబ్బయమ్మ, బాబురావు, బి.శ్రీను, ఉలవపూడి రాము, సత్యనారాయణ రాజు, ఇర్మియ, మునుగోటి శ్రీను, కోటేశ్వరరావు, షేక్ సుభాని పాల్గొన్నారు.

ప్రజల కోసమే కమ్యూనిస్టులు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో సోమవారం సీపీఐ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశాలు... జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జేవీ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం సీపీఐ పోరాడుతూనే ఉంటుందన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం అవసరమని, కమ్యూనిస్టులకు రాజకీయ లబ్ది, పదవీ వ్యామోహాలు ఉండవని... కేవలం ప్రజా సమస్యల పరిష్కారమే అజెండా అని పేర్కొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలోని అన్ని రంగాలు తిరోగమన దిశగా పయనిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడమే బీజేపీ అజెండాగా పెట్టుకుందని విమర్శించారు. ఇండియా కూటమి తప్పిదాలవల్లే మోదీ మూడోసారి ప్రధాని అయ్యారన్నారు. రాముని మందిరం కట్టిన నియోజకవర్గంలో కూడా బీజేపీ అభ్యర్థి ఓటమిపాలయ్యారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని అన్నారు. కేంద్రం... అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తామనడం హాస్యాస్పదమన్నారు. గ్రాంట్ గా ఇచ్చి విభజన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన, అమలు చేయించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉందన్నారు. స్పష్టమైన హామీ ఇచ్చి పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేసే ఆలోచన విరమించుకొని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని హామీ నివ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. సీపీఐ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కొత్త తరం పార్టీలోకి రావాలన్నారు. ప్రతి గ్రామ శాఖలో కూడా మూడు ప్రజా సంఘాల శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పోరాటాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ మంత్రి రాజీనామా

కోల్‌కతా: ఏ అధికారికి తాను క్షమాపణ చెప్పబోనని పశ్చిమ బెంగాల్ మంత్రి అఖిల్ గిరి తెలిపారు. సోమవారం తన మంత్రి పదవికి ఆయన రాజీనామా చేశారు. సీఎం మమతా బెనర్జీ కార్యాలయానికి రాజీనామా లేఖ పంపినట్లు చెప్పారు. 'నేను ప్రధాన కార్యదర్శి ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి నా రాజీనామా సమర్పించా. కానీ నేను ఏ అధికారికి క్షమాపణ చెప్పను. అవసరమైతే ముఖ్యమంత్రికి క్షమాపణ చెబుతా' అని మీడియాతో అన్నారు. ఆ రోజు ప్రజల కష్టాలు చూసి, అటవీ శాఖ వారు చిరు వ్యాపారులను ఎలా హింసిస్తున్నారో చూసి తాను సహించలేకపోయానని మంత్రి అఖిల్ గిరి తెలిపారు. తాను మాట్లాడినందుకు కాదని, ఒక ప్రత్యేకమైన పదం వాడినందుకు క్షమించాలని కోరారు. తాను ఏమి చేసినా ప్రజల కోసమేనని అన్నారు. రామ్‌నగర్ టీఎంసీ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయనగరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, మతోన్మాద, విద్వేష, కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజెప్పాలని, గ్రామస్థాయి నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ (మాజీ ఎమ్మెల్సీ), జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ విజయనగరం జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక అమర్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ... కేంద్రం లో ఇండియా కూటమి మెరుగైన ఫలితాలు సాధించిందన్నారు. మోదీ పదేళ్ళ గా ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ఆలోచన ధోరణితోనే పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో రాజ్యాంగ బద్ధంగా లౌకికతత్వ ప్రజాస్వామ్యం అమలు జరగాలన్నదే కమ్యూనిస్టుల ఆకాంక్ష అని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అసమర్థ పాలనతో దేశంలో ఏ వర్గాన్నీ సంతృప్తి పరచలేకపోయిందన్నారు. ప్రజల సమస్యలపై నిత్యం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా లో భూ పోరాటాల ద్వారా ఎంతోమంది పేదలకు భూమిలిప్పించిన చరిత్ర పార్టీకి ఉందన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం పోరాటం చేయాలన్నారు. డిసెంబర్ 25 నాటికి పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్ల అవుతుందన్నారు. సీపీఐ కార్యకర్తలు మరింత ఉత్తేజంతో పని చేయాలని, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి జీ ఈశ్వరయ్య మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం దేశాన్ని బడా వ్యాపారుల చేతుల్లో పెట్టిందన్నారు. బడాబాబులు చేసిన రూ.16లక్షల కోట్లు అప్పులను మోదీ రద్దు చేశారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి నిధుల వరద అన్నారని... అసలు మన రాష్ట్రానికి ఎంత వచ్చిందన్న విషయంలో స్పష్టత లేదన్నారు. విశాఖ రైల్వేజోన్ గురించి ప్రశ్నిస్తే... స్థలం లేదంటున్నారని కేంద్రంపై మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదేనన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక డబ్బులు లేవని మాటమారుస్తున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అప్పుల గురించి తెలియకుండానే హామీలిచ్చారా అని ప్రశ్నించారు. చట్ట సభల్లో కమ్యూనిస్ట్ పార్టీ లేకపోవడం వల్ల ప్రజా సమస్యలపై చర్చలేకుండా వ్యక్తిగత ధూషణలకే పరిమితమవ్వడం గమనించాలన్నారు. పార్టీకి క్షేత్ర స్థాయిలో బలమైన పునాదులుండాలనీ, అందుకోసం పార్టీ శాఖలు పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పెంచుకోవాలనీ,ప్రజా సంఘాలు పెరగాలన్నారు. ప్రజల సమస్య కోసం పోరిడేవారిని ప్రజలు తప్పక గుర్తిస్తారన్నారు..విజయనగరం లో తొలిసారిగా నవంబర్ 28 నుంచి మూడు రోజుల పాటు ఏఐఎస్ఎఫ్ మహా సభలు నిర్వహిస్తున్నామని... వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీ కామేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం నుంచి బయటపడేందుకు సీపీఐ మాత్రమే ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. విభజన తర్వాత ప్రత్యేక హోదాపై పోరాడిందని, అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసిందని చెప్పారు. రాష్ట్రంలో ఏ జిల్లాలోలేనంతగా భూ పట్టాలు పంపిణీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జరిగిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతపై కోర్టుకెక్కిన జగన్

- బుల్లెట్ ప్రూఫ్ వాహనం సరిగ్గాలేదు
- తనను అంతమొందించేందుకు ప్రభుత్వం కుట్ర
- భద్రత కల్పించాలని హైకోర్టులో పిటిషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తనకు వ్యక్తిగత భద్రత విషయంపై ఏపీ హైకోర్టును వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశ్రయించారు. గతంలో తనకున్న భద్రతను కొనసాగించేలా కోర్టు ఆదేశాలు జారీచేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తనకున్న భద్రతను ఏకపక్షంగా తొలగించిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తనను అంతమొందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తనకు ప్రాణహాని ఉందన్న అంశాన్ని పరిశీలించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. తనకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా సరిగ్గా లేదని ఆ పిటిషన్‌లో వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయింది. దీనిపైనా ప్రతిపక్ష హోదా కల్పించాలంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో వరుస వారీగా జగన్ హైకోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. అటు సార్వత్రిక ఎన్నికల అనంతరం జగన్ ఎక్కువగా బెంగళూరుకే పరిమితమవుతున్నారు. వినుకొండలో వైసీపీ కార్యకర్త రషీద్ హత్య అనంతరం ఆ ప్రాంతానికి జగన్ వెళ్లగా, ప్రభుత్వం నుంచి పాత బుల్లెట్ ప్రూఫ్ వాహనం కల్పించిందన్న విమర్శలున్నాయి. దీంతో మార్గమధ్యలోనే జగన్ ఆ కారును దిగి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కారులో వినుకొండకు వెళ్లారు. ఈ సమయంలోనే జగన్‌కు భద్రత అంశాన్ని పార్టీ శ్రేణులు లేవనెత్తారు. ఆ తర్వాత కూడా వరుస వారీగా వైసీపీ కార్యకర్తలపై దాడులు, హత్యల పరంపర కొనసాగుతోంది. ఇదిలా ఉండగా జగన్ భద్రతకు సంబంధించి ప్రభుత్వం వివరణ ఇచ్చింది. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డికి జడ్ ప్లస్ భద్రత కొనసాగుతోందని, సీఎం హోదాలో ఉండే భద్రతను మాత్రమే కుదించినట్లు అధికారులు తెలిపారు.

నేడు విజయవాడకు జగన్... వైసీపీ కార్యకర్తకు పరామర్శ

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో దుండగుల దాడిలో హత్యాయత్నానికి గురై విజయవాడ సన్‌రైజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ నాయకుడు గింజుపల్లి శ్రీనివాసరావును మంగళవారం సాయంత్రం 4 గంటలకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శించనున్నారు. బెంగళూరు పర్యటన అనంతరం గన్నవరానికి జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాసరావును పరామర్శించిన అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు. బుధవారం, గురువారం రెండు రోజుల్లోనూ ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులతో జగన్ వరుసగా సమావేశం కానున్నారు. ఈ రెండు రోజులు పూర్తిగా వారితో సమావేశాలకు కేటాయించినందున ఇతరులెవ్వరినీ పార్టీ అధ్యక్షుడు కలవడానికి ఆస్కారం లేదని పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. దీన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించాలని విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం: పేర్ని వెంకట్రామయ్య

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో గడిచిన 60 రోజులుగా అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు... నారా లోకేశ్ ప్రకటించిన రెడ్‌బుక్ రాజ్యాంగానికి లోబడి పరిపాలన సాగుతోందని మాజీ మంత్రి పేర్ని నాని ఆక్షేపించారు. తాడేపల్లిలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడే పోలీసు విధి నిర్వహణను కొత్త పోకడలతో నడిపించే పరిస్థితి కనిపిస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని పోకడలు కూటమి ప్రభుత్వంలో చూస్తున్నామని విమర్శించారు. గతంలో యూపీ, బీహార్‌లో ఇలాంటి ప్రభుత్వ ప్రేరేపిత హింసను చూశామని, ఇప్పుడు ఆ పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రోజు రోజుకూ రాష్ట్రంలో హింస పేట్రేగి పోతోందని ఆవేదన చెందారు. పోలీసుల సమక్షంలోనే ఇదంతా జరుగుతోందని, చివరకు పోలీసుల పైనా దాడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదని అన్నారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో జరిగిన సుబ్బారాయుడి దారుణ హత్య అత్యంత హేయం అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ శాంతిభద్రతలపై తేనె పూసిన మాటలతో ప్రజలను మభ్యపెట్టారని ఆనాటి వీడియోలు విలేకర్ల ప్రదర్శించారు. తాజాగా చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలను మీడియా ముందు ప్రదర్శించారు. రాజకీయ పార్టీ తరహాలోనే ప్రభుత్వాన్ని నడుపుతామని చంద్రబాబు చెప్పడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ విభజనను ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఉత్తర బెంగాల్‌తో కూడిన ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటు చేయాలని కొన్ని వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సోమవారం రూల్ 185 కింద అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. సీఎం మమతా బెనర్జీ ఈ తీర్మానం గురించి అసెంబ్లీలో మాట్లాడారు. సహకార సమాఖ్యను తాము నమ్ముతామని, అయితే రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. బెంగాల్ విభజన డిమాండ్‌ను తెరపైకి తెచ్చిన ప్రతిపక్ష బీజేపీ కూడా విభజన వ్యతిరేక తీర్మానానికి మద్దతిచ్చింది. అయితే ఉత్తర ప్రాంతాల అభివృద్ధిని కోరుతున్నట్లు పేర్కొంది. తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి మాట్లాడారు. 'ఐక్య పశ్చిమ బెంగాల్ సమగ్ర అభివృద్ధిని మేం కోరుకుంటున్నాం. రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నానికైనా మేం వ్యతిరేకం' అని స్పష్టం చేశారు.

సాగర్ గేట్ల ఎత్తివేత

దిగువకు వరద నీరు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/కర్నూలు: ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతితో నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. దీంతో సోమవారం ప్రాజెక్టు రేడియల్ క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. నాగార్జున సాగర్ పూర్తి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సాగర్‌లో 295.70 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. జలాశయం అసలు సామర్థ్యం 590 అడుగులు ఉండగా, ప్రస్తుతం 584 అడుగులకు నీటి మట్టం చేరింది. సాగర్ ఇన్‌ఫ్లో 3.23 లక్షల క్యూసెక్కులకుగాను అవుట్ ఫ్లో 1,63,000 క్యూసెక్కులుగా ఉంది. తొలుత ఆరు క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. అనంతరం ఒక్కొక్కటిగా సోమవారం సాయంత్రం వరకు 16 గేట్లను ఎత్తివేశారు. గేట్లు ఎత్తివేసే సమయంలో సాగర్ ఆయకట్టు దిగువ ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్ మోగించారు. సాగర్ క్రస్టు గేట్ల ద్వారా దాదాపు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలనున్నట్లు అధికారులు తెలిపారు. తొలుత సాగర్ నీటి విడుదల సమయంలో కృష్ణమ్మకు అధికారులు పూజలు నిర్వహించి, గేట్లను ఎత్తివేశారు. ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు జిల్లాల లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

కృష్ణమ్మకు తగ్గిన వరద ఉధృతి

కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరద ఉధృతి తగ్గడంతో శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో జలాశయం స్పిల్‌వే 10 గేట్లు 12 అడుగుల మేర ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు జూరాల స్పిల్‌వే నుంచి 2,31,696 క్యూసెక్కులు, పవర్ హౌస్ నుంచి 22,223 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,07, 536 క్యూసెక్కులు మొత్తం 3,61,455 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి దిగువ సాగర్‌కు 3,10,840 క్యూసెక్కులు, ఏపీ జల విద్యుత్‌కు 26,016 క్యూసెక్కులు, తెలంగాణా జల విద్యుత్‌కు 37,857 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 883 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 204.7889 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పులిచింతల ప్రాజెక్టు గేట్లు ఎత్తిన అధికారులు

వరద నీరు వస్తుండటంతో పల్నాడు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు... 26,083 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి పులిచింతలకు 30,388 క్యూసెక్కులు వరద నీరు వస్తోంది. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టులో 3.61 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. నాగార్జున సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో మరికొన్ని గేట్లు ఎత్తేందుకు అధికారుల ప్రణాళికలు రూపొందించారు. పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

చిన్నారులను చిదిమేస్తున్నారు!

- విపరీత కోరికతో అకృత్యాలు
- ఆరిపోతున్న పసిప్రాణ దీపాలు
- వావివరసలు మరిచి లైంగిక దాడులు
- 'పోక్సో'కూ భయపడని మృగాళ్లు

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: అంతులేని 'కోరిక'తో అకృత్యాలకు తెగబడుతున్నారు మానవమృగాళ్లు. ఆడేపాడే వయసు నుంచి కాటికి కాలుచాచే వయసులోనూ కామాంధులు చిన్నారులను కాటేస్తున్నారు. దీంతో నానాటికీ పసిపాపలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. బడి, ఆట స్థలాలు, అంగడి ప్రదేశాలు ఇలా... ఏదో ఒకచోట అమ్మాయిలపై లైంగిక దాడులు నిత్యకృత్యంగా మారాయి. అన్నా అని పిలిచినా... నాన్న... చిన్నాన్న... హితుడు... స్నేహితుడు... ఇలా ప్రతి చోట బాలికలపై కామపిశాచిల వేధింపులు ఆగడం లేదు. నయవంచనతో లైంగిక దాడులు చేసి బాలికల జీవితాలను చిదిమేస్తున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా అత్యాచారాలకు... ఆపై హత్యలకు పాల్పడుతూనే ఉన్నారు కామాంధులు. పాలుగారే పసిప్రాణదీపాలను కొన్ని చీడపురుగులు ఆర్పేస్తున్నాయి. బంగారు బాల్యాన్ని చిదిమేస్తున్నాయి. అభంశుభం తెలియని పిల్లలకు ఏదిమంచో ఏది చెడో ఆలోచించే జ్ఞానం ఉండదు. చిన్నపాటి ఆశచూపే బాలికలు... మానవ మృగాళ్ల కబంధహస్తాలో నలిగిపోతున్నారు. నయావంచనతో తినుబండారాలు, ఆట వస్తువులు కొనిస్తానని బయటకు తీసుకువెళ్లి లైంగిక దాడులకు దిగుతున్నారు. విచక్షణ మరిచి రాక్షస మనస్తత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ఘటనలు తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి. లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకువచ్చింది. దానికి 2012, మే 2న పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అదే ఏడాది నవంబరు 14 నుంచి అమలులోకి తీసుకువచ్చారు. పిల్లలను శారీరకంగా, మానసికంగా వేధిస్తే నిందితులపై పోక్సో కేసు నమోదు చేస్తారు. 18 ఏళ్లలోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుంది. అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలతో పాటు మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. అయినా చిన్నారులపై నేరాలు పెరిగిపోతూనే ఉన్నాయి.

నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలి

జిల్లాలో ఐసీడీఎస్, డీసీపీఓ, చైల్డ్ లైన్ వంటి విభాగాలు ఉన్నా నేరాలను అరికట్టడంలో ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. జిల్లాలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులతో పాటు చట్టాలు చేసే శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, రాజ్యసభ సభ్యులు, ఇతర మేధావులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఇలా ఎందరో ఉన్నారు. వీరందరితో సమిష్టిగా లైంగిక నేరాల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షించే ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా జిల్లా యంత్రాంగం... పాలకులు అడుగులు వేయాలి. బాల్యానికి భద్రత కల్పించాల్సిన అవసరం, బాధ్యత కూడా వారితోపాటు మనందరిపైన ఉంది.

మన్నవ యామిని-ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.